# ప్రజాశక్తి

శుక్రవారం 1 ఆగస్టు 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు






## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం
# సాధ్యమేనా?

- నేటి నుంచి అమలుకు కసరత్తు
- తూతూ మంత్రంగా అధికారుల చర్యలు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులపై నిషేధం శుక్రవారం నుంచి అమలు కానుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబరు 2 నుంచి పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ పై నిషేధం అమలు కావాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం నుంచి నిషేధం అమలుకు ఉత్తర్వులు ఇచ్చినట్టు గుంటూరు నగర కమిషనర్ పి.శ్రీనివాసులు తెలిపారు. గుంటూరులో ఇప్పటికే నగరపాలక సంస్థ అధికారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం అమలుకు చర్యలు చేపట్టారు. అయితే ఆచరణలో ఈ నిర్ణయం ఎంత వరకు సాధ్యం అన్న అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

ప్రధానంగా సింగిల్ యూజ్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల తయారీని పూర్తిగా నిరోధించకుండా వినియోగంపై విధించే ఆంక్షలు ఇప్పటి వరకు సఫలీకృతం కాలేదు. కొన్నేళ్లుగా ఏటా ఇదే తరహాలో నిషేధం అమలు చేస్తున్నట్టు ప్రకటించడం, కొద్ది రోజులు అధికారులు హడావుడి చేయడం తరువాత వదిలివేయడం పరిపాటైంది. నిషేధం అమలు ఆచరణలో విజయవంతం కాకపోయిన అధికారులకు మాత్రం కాసుల వర్షం కురుస్తోంది. ప్లాస్టిక్ కవర్లు పట్టుబడిన దుకాణాలకు భారీగా ఫెనాల్టీలు వేస్తామని బెదిరించి దుకాణదారుడు వద్ద సొమ్ము తీసుకుని మిన్నకుండిపోతున్నారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల తయారీ దారులను నిరోధించకపోవడం వల్ల మార్కెట్‌లోకి ఇబ్బడి ముబ్బడిగా వస్తున్నారు. గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయం గోడకు అనుకుని ఉన్న పండ్ల దుకాణాల వద్దనే సింగిల్ యూజ్ కవర్లు యథేచ్ఛగా వాడుతున్నా నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. నగరపాలక సంస్థ కార్యాలయం పరిసరాల్లో అన్ని దుకాణాల్లో కవర్ల వినియోగం, విక్రయం జోరుగా సాగుతోంది. కానీ అధికారులు సంబంధిత చిరు వ్యాపారుల వద్ద సొమ్ములు తీసుకుని వదిలివేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రజలు బయటకు వచ్చే ముందు వస్త్రంతో తయారు చేసిన సంచులను తీసుకుని రావాలన్న స్పృహ చాలా మందికి ఉండకపోవడం వల్ల కూడా

▶ 2లో

# విద్యుత్ మీటర్లపై ప్రజాఉద్యమం

- అంగీకారంతో సంబంధం లేకుండా పూర్తిగా నిలిపేయాలి
- 5న వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా




మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

విద్యుత్ ఛార్జీలు పెంచినా, స్మార్ట్ మీటర్లు బిగించినా ప్రజా ఉద్యమం తప్పదని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. స్మార్ట్ మీటర్లను ఎక్కడికక్కడ పగలగొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సమావేశం ఏపూరి గోపాలరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ అదాని స్మార్ట్ మీటర్ల ప్రక్రియపై ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత, ఆందోళన నెలకొన్న నేపథ్యంలో స్పందించిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్మార్ట్ మీటర్లు అంగీకరించిన వారికి బిగించబోమని చెప్పారని అన్నారు. అయితే అంగీకారాలతో సంబంధం లేకుండా ఈ ప్రక్రియనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిఎం చంద్రబాబు విద్యుత్ సంస్కరణల పేరుతో కార్పోరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతూ సామాన్యులపై పెను భారాలు మోపుతున్నారని విమర్శించారు. గతంలో విద్యుత్ ఛార్జీలు పెంచడం వల్ల ప్రజా

▶ 2లో



## బీఈడీ ముల్యాంకనంలో నిబంధనలకు పాతర

ప్రజాశక్తి - గుంటూరు రూరల్

బీఈడీ, డిగ్రీ మూల్యాంకనాన్ని ఒకే అధ్యాపకుడితో చేయిస్తూ నాగార్జున యూనివర్సిటీ మరోసారి నిబంధనలకు పాతరేసింది. నిబంధనలకు విరుద్ధంగా చీఫ్‌ల నియామకంలో ఎఎన్‌యు బీఈడీ రెండో సెమిస్టర్ మూల్యాంకనం పక్కదారి పట్టింది. 2007 నుండి బాపట్లలోని ఒక డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న 022101008 వర్సిటీ కోడ్‌లో ఒక అధ్యాపకుడితో డిగ్రీ పరీక్ష పేపర్‌ను మూల్యాంకనం చేయిస్తున్నారు. 2016 నుంచి నరసరావుపేటలోని ఒక

▶ 2లో




## కలెక్టరేట్ వద్ద రేపు ఫ్యాప్టో ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగ, ఉపాధ్యాయ బకాయిలు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గుంటూరు కలక్టరేట్ వద్ద శనివారం జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె.నరసింహారావు కోరారు. ధర్నా సన్నాహక సమావేశం గురువారం స్థానిక ఎపిటిఎఫ్ 257 కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్

▶ 2లో




# పత్తి సాగుకు మొగ్గు

- పొగాకు, మిర్చికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, శనగ
- కాల్వలకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా
- జలాశయాలకు కొనసాగుతున్న ప్రవాహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఖరీఫ్ సాగులో ఈ ఏడాది మెట్ట ప్రాంతంలో రైతులు ఎక్కువగా పత్తి సాగుకు మొగ్గుచూపుతున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 20 రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడం, ఎగువ నుంచి వచ్చిన వరదతో జలాశయాలు అన్ని నిండటం వల్ల కాల్వలకు పూర్తి స్థాయిలో నీరు వస్తుండటంతో ఎక్కువ మంది రైతులు సాగుకు సిద్ధమయ్యారు. గతేడాది మిర్చి సాగు చేసిన వారు ధరలు పడిపోయి తీవ్రంగా నష్టపోవడం వల్ల ఈ ఏడాది మిర్చి సాగుకు ఎక్కువ మంది రైతులు సుముఖత చూపడం లేదు. పొగాకు ధరలు కూడా భారీగా పడిపోవడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించారు. మిర్చి, పొగాకు స్థానంలో పత్తితో పాటు మొక్కజొన్న, శనగ సాగుకు

▶ 2లో



## విద్యుత్ మీటర్లపై ప్రజాఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

తిరుగుబాటుతో టిడిపి ప్రభుత్వం కూలిపోయిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సెకీతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామనే హామీని విస్మరించారన్నారు. స్మార్ట్ మీటర్ బిగించడం ఎంతో మంది విద్యుత్ వెలుగుల నుండి దూరమయ్యే ప్రమాదం ఉందని, విద్యుత్ రంగ ప్రయివేటికరణకు ఇది తొలి అడుగని చెప్పారు. స్మార్ట్ మీటర్లు పెట్టాక పూటకొక రకంగా విద్యుత్ మీటర్ వేగం పెరుగుతుందని, దానిని అదుపు చేసే విధానం లేదని అన్నారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 5న విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, సచివాలయాల వద్ద జరిగే ధర్నాల్లో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ఊపందుకున్న నేపథ్యంలో రైతులు వద్ద ఉన్న పొగాకు కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, పరిమితంగా కొనడానికి స్వస్తి పలికి పెద్ద ఎత్తున కొనాలని కోరారు. నాగార్జున సాగర్ ముంపు ప్రాంతాల్లో ప్రజలకు పునరావాసం కల్పించాలన్నారు. తొలకరి వర్షాలకు పత్తి సాగు చేసి తీవ్ర వర్షాబావ పరిస్థితులను నేపథ్యంలో నష్టపోయిన రైతులకు పత్తి విత్తనాలు కొనుగోలు చేసేందుకు ఇన్పుట్ సబ్సిడీ కింద నగదు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

## పత్తి సాగుకు మొగ్గు

(మొదటి పేజీ తరువాయి)

సుముఖత చూపుతున్నారు. నాగార్జున సాగర్ జలాశయం పూర్తిగా నిండటం వల్ల కాల్వలకు కూడా పూర్తి స్థాయిలో నీరు రావడం వల్ల సాగర్ ఆయకట్టులో వరి సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు.

శ్రీశైలం నుంచి సాగర్‌కు నీటి ప్రవాహం కొనసాగుతోంది. నాగార్జున సాగర్‌కు ఎగువ నుంచి 2,82,609 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా సాగర్‌కు ఉన్న 26 క్రస్టు గేట్లను ఎత్తి దిగువకు 2,43,829 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి పులిచింతలకు 2,09,404 క్యూసెక్కుల నీరు వస్తోంది. పులిచింతల నుంచి దిగువకు అదే స్థాయిలో 2,09,404 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజికి 2,65,909 క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజి అన్ని గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. డెల్టా కాల్వలకు 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ పరిధిలోని వివిధ మేజర్లకు కూడా కలిపి 15 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం అటు సాగర్ ఆయకట్టులో, ఇటు డెల్టాలో నీటి ఎద్దడి తొలగిపోవడం వల్ల పంటల సాగుకు అవకాశాలు మెరుగుపడ్డాయి. తాడికొండ, ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గంలోని చేబ్రోలు, పెదకాకాని మండలల్లో పత్తి సాగు చురుగ్గా సాగుతోంది. తెనాలి, పొన్నూరు, మంగళగిరి నియోజకవర్గాల పరిధిలోని డెల్టా ప్రాంతంలో వరి సాగుకు వెదపద్ధతిలో ఎక్కువ మంది సాగు చేస్తున్నారు. మరికొంత మంది రైతులు తెనాలి, పొన్నూరు, కొల్లిపర, కాకుమాను, పెదనందిపాడు, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో నాట్లు వేసేందుకు నారుమళ్లు పోస్తున్నారు. ప్రస్తుతానికి అవసరానికి మించి వర్షం కురిసిందని కాల్వల్లో పుష్కలంగా నీరుండడంతో రైతులు పూర్తిస్థాయిలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

## బీఈడీ ముల్యాంకనంలో నిబంధనలకు పాతర

(మొదటి పేజీ తరువాయి)

బీఈడీ కళాశాలలో పనిచేస్తున్నట్లు ఎఎన్‌యు అప్రూవల్ చేసి వారితో బిఈడి మూల్యాంకనం చేస్తున్నారు. 60 ఏళ్ల దాటిన ఇతనినీ నిబంధనలకు విరుద్ధంగా చీఫ్‌గా నియమిస్తున్నారనే విమర్శలున్నాయి. నిబంధనల ప్రకారం 60 ఏళ్ల దాటిన వారిని చీఫ్‌గా నియమించకూడదు. ఈ విధంగా గతంలో తొలగించిన వర్సిటీ ఈసారి మాత్రం పేపర్ 2లో నరసరావుపేటలోని ఒక లెక్చరర్‌ని పేపర్ 3లో 61 ఏళు దాటిన తెనాలి డివిజన్లోని ఒక లెక్చరర్‌ను చీఫ్‌గా నియమించినట్లు సమాచారం.

# ఉద్యోగ విరమణ చేసిన వారికి సత్కారాలు



**ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్**

వడ్డేశ్వరం జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం గుంద్ర సుబ్బారావు ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి సుబ్బారావు దంపతులను సత్కరించారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కాకుమాను జోజప్ప మాట్లాడుతూ 15 ఏళ్లపాటు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడుగా, 19 ఏళ్లు ఉన్నత పాఠశాల జీవశాస్త్రం అధ్యాపకుడిగా, నాలుగేళ్లు వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎంగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందించారని చెప్పారు. పాఠశాలలో విద్యార్థులను క్రమశిక్షణలో నడిచేందుకు తగిన సూచనలు చేసేవారని, పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కత్తిక రాఘవరావు, మాజీ సర్పంచ్ షేక్ చిన్న రంగా షరీఫ్, స్కూల్ కమిటీ చైర్మన్ ఎస్.కె బషీరున్నీసా, ఉపాధ్యాయులు చావా శ్రీనివాస్, తోట శ్రీనివాసరావు, శరత్ చంద్ర, పిఆర్‌టియు నాయకులు బి.రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి, కె.విజయ్ కుమార్ పాల్గొన్నారు.



**ప్రజాశక్తి - తెనాలి**

పాఠశాల అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అంబరీషుడు చేసిన కృషి అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు కె.రాజారెడ్డి అన్నారు. స్థానిక చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన అంబరీషుడు ఉద్యోగ విరమణ అభినందన సభ గురువారం పాఠశాలలో నిర్వహించారు. హెచ్‌ఎం రాజారెడ్డి మాట్లాడుతూ 41 ఏళ్లపాటు ఉపాధ్యాయునిగా పనిచేసిన అంబరీషుడు ఎస్టియు నాయకులుగా కూడా పని చేశారన్నారు. వార్డు కౌన్సిలర్ గోగిరెడ్డి మానస మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తమదైన పాటుపడ్డారన్నారు. అనంతరం అంబరీషుడు దంపతులను సత్కరించారు. ఎస్‌టియు నాయకులు కె.బెనహర్, డాక్టర్ డి.అనిల్ కుమార్, డాక్టర్ ఇ.అపర్ణ స్వాతి, సుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



**ప్రజాశక్తి - ఎఎన్‌యు**

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అభివృద్ధిలో ఉద్యోగుల సేవలు అమూల్యమని వర్సిటీ ఉన్నతాధికారులు అన్నారు. వర్సిటీ వికాస భవన్‌లో రాంకూరి చంద్రశేఖర్ ఉద్యగ విరమణ సన్మాన కార్యక్రమం గురువారం జరిగింది. వీసీ కె.గంగాధర్, రెక్టార్ రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం మాట్లాడుతూ చంద్రశేఖర్ 40 ఏళ్లపాటు వర్సిటీలో వివిధ దశల్లో, వివిధ విభాగాల్లో సేవలు అందించారని చెప్పారు. ఉద్యోగులందరూ అంకితభావంతో పనిచేసి యూనివర్సిటీని ప్రగతి పథంలో నడపాలన్నారు. కార్యక్రమానికి వికాస ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించగా అధ్యక్షులు నీలపు ప్రసాదు, ఎడ్ల రాధాకృష్ణ, మాజీ కార్యదర్శి కావూరు శ్రీనివాసరావు, వికాస కార్యవర్గ సభ్యులు శ్రీను శశి, నాగరాజు, కొలికపూడి యేసయ్య, ఎన్.శ్రీనివాసరావు, నూతక్కి వెంకటేశ్వర్లు, దినసరి ఉద్యోగులు ప్రభాకర్, నీలకంతేశ్వరరావు, రాజ్ కుమార్, టిఎన్టియుసి నాయకులు కోడూరు కనకరాజు పాల్గొన్నారు.

## నిజాంపట్నం, చుండూరు గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి నేడు కౌన్సెలింగ్

**ప్రజాశక్తి-గుంటూరు :** బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం, చుండూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలురు)లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి నేడు ఆయా పాఠశాలల్లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. నిజాంపట్నం గురుకుల పాఠశాలలో 5 నుండి 12వ తరగతి వరకూ, చుండూరు గురుకుల పాఠశాలలో 5, 10, 11, 12వ తరగతుల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించి సీట్లు పొందాలని చెప్పారు. ఇతర వివరాల కోసం నిజాంపట్నం 9490450044, చుండూరు 9441412544 నంబర్లలో సంప్రదించాలన్నారు.



## ‘అరవింద’ విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారం

**ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ :** కుంచనపల్లి అరవింద హైస్కూల్‌లో విద్యార్థి ఎన్నికలు నిర్వహించగా ఎన్నికైనవారి ప్రమాణస్వీకారం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి అమరావతి వాకర్స్ అండ్ రన్నర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కె.అజయ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిజమైన నాయకుడికి ఉండవలసిన లక్షణాలు, ఆ నాయకుడిని అనుసరించే వారికి ఉండవలసిన లక్షణాలను వివరించారు. ఏడాదికి కనీసం ఒక నైపుణ్యమన్నా నేర్చుకో వాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఇంద్రాణి, చాగంటి అరవింద్ మాట్లాడుతూ పాఠశాల ఎన్నికల ప్రాముఖ్యతను విద్యార్థులంతా తెలుసుకోవాలన్నారు. గెలిసిన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అజయ్ అందించారు. వారితో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు.

## ఉపాధ్యాయులకు తహాశీల్దార్ పరామర్శ

**ప్రజాశక్తి - తెనాలి :** కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయులను తహాశీల్దార్ కెవి గోపాలకృష్ణ గురువారం పరామర్శించారు. తొలుత కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఘటన పూర్తి వివరాలు తెలుసుకొని,



అక్కడనుండి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుల వద్దకు వెళ్లి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రమాదం లేదని తెలుసుకొన్న ఆయన అదే విషయాన్ని ఉపాధ్యాయులతో చెప్పి ధైర్యంగా ఉండాలన్నారు.



## అబద్ధాలతో గద్దెనెక్కిన కూటమి : వైసిపి

**ప్రజాశక్తి - ప్రత్తిపాడు :** మండలంలోని కోయవారిపాలెం వైసిపి శ్రేణులు గురువారం ‘బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ మండల కన్వీనర్ చల్లా హనుమంత్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, అబద్ధాలతో గద్దె నెక్కారని విమర్శించారు. ఈ మేరకు కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు.

## ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

జిల్లాలో పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ వారిని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి సతీష్‌కుమార్ సన్మానించారు. ఎస్ఐలు మోహన్ విజయకుమార్, నాగరాజేశ్వరిదేవి, ఎఎస్ఐలు భగవంతరావు, కొండలరావు, హెడ్ కానిస్టేబుళ్లు పోలయ్య, రాంబాబుల సేవలను ఎస్‌పి కొనియాడారు. పోలీస్ శాఖలో దీర్ఘకాలం పాటు సేవలందించి జులై 31న ఉద్యోగ విరమణ చేసిన వారిని అధికారులు, సహ ఉద్యోగులు సన్మానించారు. అదనపు ఎస్‌పిలు హనుమంతు, ఏడుకొండలరెడ్డి, ఆర్ఐలు సురేష్, శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దలవాయి. సుబ్రహ్మణ్యం, జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు మైల సాంబశివరావు పాల్గొన్నారు.



## సాధ్యమేనా?

(మొదటి పేజీ తరువాయి)

ప్లాస్టిక్ కవర్లు వినియోగం యథావిధిగానే ఉంటోంది. ప్లాస్టిక్ కవర్లలో పండ్లు, కూరగాయాలే కాకుండా అధిక వేడిగా ఉండే టీ, కాఫీలు, ఇతర ఆహార పదార్థాలు తీసుకువెళ్తున్నారు. దీంతో ప్లాస్టిక్ నేరుగా మనుషుల శరీరంలోకి వెళ్లి అనేక అనారోగ్య సమస్యలకు దారితీస్తోంది. అంతేగాకుండా ప్లాస్టిక్ కవర్ల వల్ల పర్యావరణం దెబ్బతింటోది. ఈ కవర్లు భూమిలో కలవకపోవడం వల్ల పశువులు ఇతర వ్యర్థపదార్థాలతో కలిపి తినడం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వేడి ఆహార పదార్థాలు, టి, కాఫీలు ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయడం వలన, వాటిని తినే ప్రజలకు క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాదులు సోకుతున్నాయని పలు నివేదికల్లో వస్తున్నాయి. ప్రజారోగ్యానికి, డ్రెయిన్లలో మురుగుపారుదలకు, పర్యావరణంకు హానీ కల్గిస్తున్న ప్లాస్టిక్‌ను సమూలంగా నిషేదించాలని, హోటల్స్, కర్రీ పాయింట్స్ నిర్వహకులు తప్పనిసరిగా ప్రత్యామ్నాయ ప్యాకింగ్ సంచుల వినియోగం చేయాలని నగర కమిషనర్ సూచించారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అక్టోబర్ 2 నాటికి ప్లాస్టిక్ రహితంగా నగరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారని, అందుకు తగిన విధంగా గుంటూరుని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం సంపూర్ణంగా నిషేధించిన నగరంగా తీర్చి దిద్దుకోవడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## కలెక్టరేట్ వద్ద రేపు ఫ్యాప్టో ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

కె.వీరాంజనేయులు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ యు.రాజశేఖర్, డికె.సుబ్బారెడ్డి, ఎమ్‌డి ఖలీల్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.బసవలింగారావు, ఎమ్‌డి సాలార్‌బేగ్, బాలాజీ సీనియర్ ఉపాధ్యాయ నాయకులు విజయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించాలని, యాప్‌ల భారం తగ్గించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సమస్యల సాధన కోసం జరిగే ధర్నాలో ఉద్యోగ ఉపాధ్యాయులు, పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## నందివెలుగులో సివిల్ రైట్స్ డే

**ప్రజాశక్తి - తెనాలి :** మండలంలోని నందివెలుగు జాషువా నగర్‌లో గురువారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహాశీల్దార్ కె.వి. గోపాలకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరునికి సంక్రమించిన ప్రాథమిక హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా ముందు అధికారుల దృష్టికి తేవాలన్నారు.

## మద్యం కేసులో ఒకరు బైండోవర్

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండల కేంద్రం ఈపూరు గ్రామానికి చెందిన వ్యక్తిని స్థానిక తహల్దార్ కార్యాలయంలో గురువారం హాజరు పరచగా రెండేళ్ల కాలపరిమితితో, రూ.2లక్షల పూచీకత్తుతో బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. రొంపిచర్ల మండలంలోని మునుమాక, అన్నవరం, విప్పర్లపల్లి, వీరవట్నం వడ్లమూడి వారిపాలెం, అన్నవరప్పాడు గ్రామాలలో ఆకస్మిక తనిఖీలు చేశామని తెలిపారు. సారాయి, అక్రమ మద్యం, కల్తీకల్లు, మాదకద్రవ్యాలు కలిగి ఉండటం నేరమని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## 90 రోజుల్లోపు లే అవుట్, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోండి

### మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

ప్రజాశక్తి - మాచర్ల

పురపాలక సంఘ పరిధిలో లే-అవుట్, ప్లాట్లను 90 రోజుల లోపు క్రమబద్ధీకరించు కోవాలని మునిసిపల్ కమిషనర్ డి. వేణుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీకు ముందు ప్లాట్‌గా రిజిష్టర్ కాబడిన లే-అవుట్, ప్లాట్లను ప్రభుత్వం వారు నిర్దేశించిన మేరకు 10 శాతం ఓపెన్ స్పేస్ లేదా 14 శాతంను ఓపెన్ స్పేస్ చార్జీలను పీనలైజేషన్ చార్జీలతో సహాచెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని లేఅవుట్ యజమానులు, డెవలపర్లు, ప్లాట్ అమ్మక, కొనుగోలుదారులు ఉపయోగించుకోవాలన్నారు. 90 రోజులలోపు క్రమబద్ధీకరించుకొనటకు http://lrsdtcp.ap.gov.in ఆన్‌లైన్ వెబ్ పోర్టర్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరములకు మాచర్ల మున్సిపల్ కార్యాలయం హెల్ప్‌డెస్క్, వార్డు సచివాలయాల్లో సంప్రదిరాలని సూచించారు.

## నేడు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల నియోజకవర్గ శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి చొరవతో నియోజకవర్గం వ్యాప్తంగా నూతనంగా 716 స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయి. నియోజకవర్గం వ్యాప్తంగా స్పౌజ్ పథకానికి అర్హులైన వారిని గుర్తించి, నివేదిక తయారు ప్రభుత్వానికి పంపగా, వారందరికీ ఆగస్టు 1, శుక్రవారం నుంచి పింఛన్ నగదు అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది.



బోనస్ పంపిణీ చేస్తున్న శేషగిరి కుమార్

## పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

2024 -25 ఆర్థిక సంవత్సరంనకు గాను పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ చేశారు. గురువారం చేపట్టిన ఈ కార్యక్రమంలో సంగం డైరీ డైరెక్టర్ పోపూరి శేషగిరి కుమార్ పాల్గొన్నారు. సంగం డెయిరీ ఆధ్వర్యంలో 116మంది రైతులకు 4,64,64,174 రూపాయల బోనస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెంటపాళ్ళ సంగం డెయిరీ మేనేజర్ తాడిపోయిన గోపి, సూపర్వైజర్ పాశం కోటేశ్వరావు, అధ్యక్షులు కంచేటి వెంకట్రావు, సంఘం వేతన కార్యదర్శి మందడి హనుమంతరావు, వర్కర్ రామచంద్రరావు, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

# ఆదమరిస్తే... అంతే సంగతులు..!

## ప్రధాన రహదారిలో పొంచివున్న ప్రమాదం

ప్రజాశక్తి - రొంపిచర్ల


కాల్వపై నిర్మించిన బ్రిడ్జిపై శిథిలావస్థలో రైలింగ్

రహదారులు, భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలతో చెలగాటంగా మారింది. నిత్యం కొన్ని వందల వాహనాలు రాకపోకలు సాగించే ప్రధానరహదారిలో టెన్.ఆర్. చిలకలూరిపేట మేజర్ కాల్వపైన నరసరావుపేట, రొంపిచర్ల మండలాల సరిహద్దు మూనమాక గ్రామ సరిహద్దులో నిర్మించిన బ్రిడ్జి ప్రమాదభరితంగా మారింది. ఎపుడు ఏ ప్రమాదం ముంచు కొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే రొంపిచర్ల, నరసరావుపేట మండలాల వాహనాలు రాకపోకలు సాగించేందుకు కొన్నేళ్ల కిందట నిర్మించారు. అప్పట్లో బిడ్జికి ఇరువైపులా ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన రైలింగ్ ప్రస్తుతం పూర్తిగా దెబ్బతింది. బ్రిడ్జిపై నిత్యం అధికసంఖ్యలో రాకపోకలు సాగించే వాహనచోదకులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంది. మండలాల సరిహద్దు విషయాన్ని పక్కన పెట్టి అటు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైలింగుకు మరమ్మత్తులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## నేటి నుండి తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

తల్లిపాల వారోత్సవాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు వివరాలను సిడిపిఒ గురువారం తెలిపారు. ఒకటవ తేదీన ప్రత్తిపాడు, కోయవారిపాలెంలో బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యంపైన, 2న చిన్న కొండ్రుపాడు, గొట్టిపాడు, నవజాత శిశువుల సంరక్షణ, తల్లి పాలిచ్చే పద్ధతులపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. సిజేరియన్, కాన్పుల అయిన బాలింతలకు తల్లిపాలు ఇవ్వడంపై అవగాహన 4వ తేదీన ప్రత్తిపాడు అవగాహన కల్పిస్తామని, 5న ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెంలో బాలింతలకు అందవలసిన ఆహారం, తాగునీరు, నిద్ర గురించి ఉన్న అపోహలు తొలగించుటకు కార్యక్రమం నిర్వహిస్తామని, 6న యనమదల, గొట్టిపాడులో బాలింతలకు, శిశువులకు వ్యక్తి గత పరిశుభ్రత, తల్లిపాలు ఇచ్చే పద్ధతులపై గృహ సందర్శన ఉంటుందని, 7న తుమ్మలపాలెం, వంగిపురంలో ఆరోగ్యకరమైన పిల్లల ప్రదర్శన, తల్లిపాలు ఇవ్వడం వలన కలిగే ఉపయోగాలు, ఇవ్వక పోవడం వలన నష్టాలు గురించి వివరిస్తామని తెలిపారు.

## నేడు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - మేడికొండూరు : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యుత్ శాఖాధికారి పుల్లారెడ్డి తెలిపారు. సిరిపురం విద్యుత్‌లైన్ ప్రధాన మార్గాల్లో హైవోల్టేజ్ విద్యుత్ లైను 30 కెవి ఏర్పాటులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని, పాలడుగు, పొట్లపాడు, వెలవర్తిపాడు, సిరిపురం, మందపాడు, గ్రామాల్లో నూతన విద్యుత్ లైను ఏర్పాటు ఉంటుందని తెలిపారు.

## రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - తెనాలి

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై రైల్వే పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వారి వివరాల ప్రకారం తెనాలి రైల్వే స్టేషన్ ఉత్తర్ క్యాబిన్ సమీపంలో సుమారు 32-35 మధ్య ఏళ్ల వయసున్న వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిఆర్పీ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .

## విస్తృతంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - తెనాలి


తనిఖీల సందర్భంగా డిఎస్పీతో మాట్లాడుతున్న ఎస్పి

పట్టణంలో పోలీసులు గురువారం రాత్రి విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. వరుసగా గంజాయి ముఠా పట్టు బడు తున్న తరుణంలో వాహనాల తనిఖీ చర్చనీయాంశమైంది. పట్ట ణంలో ఏడు బృందాలుగా ఏర్పడి పోలీసులు నలుదిక్కులా వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్పీ సతీష్‌కుమార్ తెనాలి వచ్చి వాహనాల తనిఖీని పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్పీ బి జనార్ధనరావు, త్రీటౌన్ సిఐ ఎస్.రమేష్ బాబుతో మాట్లాడారు.

## రేపు జీవీ ఆంజనేయులు ప్రజాదర్బార్

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికై శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రజాదర్బార్‌కు ప్రభుత్వ చీఫ్‌విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ముఖ్య అతిధులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు. సమస్యలు ఉన్నవారు నేరుగా చీఫ్ విప్ జీవీని కలసి సమస్యలు వివరించవచ్చని ఆయన కార్యాలయం ప్రతినిధులు సూచించారు. వినుకొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అయిదు మండలాల నుంచి ప్రజలు ప్రజాదర్బార్‌కు తరలివచ్చి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరి వద్ద విజ్ఞాపన పత్రాలు చీఫ్ విప్ జీవి స్వయంగా స్వీకరించి సాధ్యమైనంత మేరకు తక్షణమే పరిష్కారాలు చూపిస్తారని పేర్కొన్నారు. మిగిలిన వాటికి వినతుల ద్వారా వచ్చే సమస్యలు ఇక్కడి నుంచే విభాగాల వారీగా విభజించి సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.



**NOTICE**

**IN THE COURT OF THE HON'BLE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION) :: AT GUNTUR**

**(In the matter of issues of Succession Certificate to the Petitioner DODDAPANENI NISCHALA, D/o Late Ramineni Ranga Rao and Ramineni Jayasree (Father and Mother) Declaring her as the L.R./Successor to her parents)**

**SUCCESSION O.P. NO. 47/2025**

Between :

Doddapaneni Nischala, D/o Late Ramineni Ranga Rao (father) R/o Door No. 4-22-31, 1st lane, Chaitanyapuri, Koritepadu Park road extension, Guntur - 522007.

Presently residing at :

Flat No. 403, Sree Sai Paradise, 4th A Main Road, Pillareddy Nagar, OMBR Layout, Near CMR Law College, Banaswadi, Bangalore - 560043. .... Petitioner

AND

1. State Bank of India, Koritepadu Branch Office, Guntur.
2. Indian Over Seas Bank, Donka Road Branch, Guntur ... Respondents

It is hereby inform to all of you that our client who is the petitioner filed Succession Original Petition No.47/2025 for seeking succession certificate of her deacesed father and mother DODDAPANENI NISCHALA D/o. Late Ramineni Ranga Rao and Ramineni Jayasree (Father and Mother) Declaring her as the LR/ Successor to her parents before the Hon'ble Prl. Senior Civil Judge, Guntur against the above named respondents, the above case stand posted to 14.08.2025 for appearance of respondents.

You are all hereby to appear before the Hon'ble Court on 14.08.2025 at 10.30 A.M. either personally or through your Advocate without failure. Otherwise the matter will be set exparte in your absence.

Hence this Publication

Date of adjournment 14.08.2025

**P.V.RAMANA,**
**A.SAROJA,**
**S.PAVANI**
**Advocates**
**D.No. 19-22,priyanka mansion,**
**chaitanya puri Guntur 522007**

## అక్రమ వడ్డీ వ్యాపారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

ధర్మవరంలో చేనేత కార్మికుడు రమణ కుటుంబంపైన తన అనుచరులతో కలిసి దాడి చేసి హత్యాయత్నం చేయబోయిన అక్రమ వడ్డీ వ్యాపారి రాజాను కఠినంగా శిక్షించాలని పల్నాడు జిల్లా జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం డిమాండ్ చేశారు. గురువారం పెదకూరపాడు మండలం లగడపాడులో ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుడు రమణ దంపతులను దారుణంగా హించించిన వడ్డీ వ్యాపారి మీద హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, అధికారులను కోరుతున్నామన్నారు. ధర్మవరంలో రెండు నెలల వ్యవధిలో ముగ్గురు చేనేత కార్మికులు వడ్డీ వ్యాపారుల ఆగడాలు భరించలేక ఆత్మహత్య చేసుకున్నారని ఈ విషయంలో కూడ లోతైన దర్యాప్తు చేసి నేరస్థులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. చేనేత కార్మికుడు రమణ అప్పుగా తీసుకుంది రూ. 6 లక్షలు మాత్రమేనన్నారు. ఇందుకు 100కి 10 రూపాయల వడ్డీ చొప్పున రూ. 60 వేల వరకు చెల్లిస్తూ ఇప్పటికే రూ.15 లక్షల వరకు రమణ కుటుంబం చెల్లించిందని తెలిపారు. చేనేత కార్మికులకు రుణమాఫీ సౌకర్యం కనిపించాలని, నూలు పట్టు రాయితీలు ఆదరణ పథకం ద్వారా నాణ్యమైన అధునాతన మగ్గాలు అందించాలని, నేతన్న నేస్తం పథకాన్ని త్వరగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షుడు అనుముల వెంకట్రావు, గ్రామ కమిటీ అధ్యక్షులు బండారు వెంకటేశ్వర్లు, మహిళా కమిటీ అధ్యక్షులు సామ్రాజ్యం, రామారావు, బ్రహ్మయ్య రాములు తిరుపతిరావు పాల్గొన్నారు.

**GENERAL NOTICE**

**IN THE COURT OF THE PRL. DIST JUDGE:: GUNTUR**

**G.W.O.P. No. 857/2025**

**Between:**

Neelala Vrushali Sridhar,W/o.Neelala Satyam Sridhar, 18 Mount crescent, Stratford upon Avon, Warwickshire, CV379JT, United Kingdom, Rep.by her written Authority Agent Waman Laxman Surve, S/o.Laxman Surve, R/o.K-102, Vrushali Shilp Chs, Chikoowadi Link Road, Shimpoli, Borivali West Mumbai 400 092. ....Petitioner

And

Nil .....Respondent

పై నెంబరు ఒ.పి.లోని పిటీషనరు తన మైనరు పిల్లలు అయిన నీలాల నిహారిక శ్రీధర్ మరియు నీలాల ధృవ్ శ్రీధర్ యొక్క విద్యాబుద్ధులు, బాగోగులు, పోషణ వగైరాలు కొరకు మైనర్ల తాలూకు ఆస్తులను అమ్ముటకు పర్మిషన్ కొరుతూ పిటీషను దాఖలు చేయగా సదరు పిటీషనులో ఎవరికైనా ఏవిధమైన ఆక్షేపణలు అభ్యంతరములు వగైరాలు ఉంటే తెలుపుకొనవలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్‌నోటీసు నిమిత్తం **ది.07-08-2025**కి వాయిదా వేసినారు.కావున ఆక్షేపణలు ఉన్నవారు వాయిదా రోజు **ఉ.గం.10-30ని.**లకు పైకోర్టు వారి యెదుట హాజరై తెలుపుకొనగలరు.

**Schedule-A:** Sale Deed Doct No.5363/2005:A total extent of 399Sq. Yards of vacant site bearing plot Nos. 510,511 situated in D.No.944 pedakakani Village and Gram Panchayat, Guntur Dt, being bounded by,**East:** Site belongs to Muchakalla Nukalamma plot No. 511/B-57ft.**South:**33ft, wide road63ft.**West:**Site belongs to Boyi Dhanalakshmi plot no.19657ft.**North:** Site belongs to Annapareddy Krishnareddy-63ft. Within the extent of above boundaries an extent of 399 Sq. yards of Vacant Site.

**SCHEDULE-B:** Partition Deed Doct No. 9540/2014 (SCHEDULE Item 1 (50%): A total extent of 266.66 Sq.Yards of RCC Daba House bearing SC No. 040473, New Assisment No.138264, situated in Dr.No.11-134, D.No. 63/3 Gorantla(V) and Gram Panchayat, Koretipadu Sub-Dt., Guntur Dt., being bounded by, C) **East:** Flat No. 105, 60ft.**South:** 30ft, wide road 40ft.,**West:** Flat No.10760ft.,**North:** Flat No.103-40ft.[Within the extent of above boundaries an extent of 266.66Sq.yards of RCC Daba House].

**Item 2:** A total extent of 323 Sq. Yards of Vacant Site bearing, Plot No. 89, situated in D.No.961/1,961/2, Pedakakani Village and Gram Panchayat, Pedakakani Sub-Dt, Guntur Dt, being bounded by,**East:**33ft, wide road-51ft.,**South:**PlotNo.90 belongs to Veeramachineni Nageshbabu- 57ft.,**West:** Land belongs to Avula Rama Narsamaba- 51ft., **North:** 33ft, wide road- 57ft. [Within the extent of above boundaries an extent of 323Sq.yards of RCC Daba House].

**Item 3:** A total extent of 524 Sq.Yards of Vacant Site bearing, Plot No.8,9, situated in D.No. 540, Nallapadu Village and Gram Panchayat, Nallapadu Sub-Dt, Guntur Dt., being bounded by, East: 30ft, wide road60ft.South: PlotNo.07 belongs to Makkena Nandini78ft.West: Site belongs to Naraboina Venkatarayudu60ft.North: Plot No.478.9ft. Within the extent of above boundaries an extent of 524 Sq. yards ofVacant Site. **East:**30ft.wide road60ft.**South:** Plot No.07 belongs to Makkena Nandini78ft., **West:** Site belongs to Naraboina Venkatarayudu-60ft., **North:** Plot No.478.9ft.Within the extent of above boundaries an extent of 524 Sq. yards of Vacant Site.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వాయిదా తేది:**07-08-2025**

**మట్టుపల్లి వెంకట సుబ్బారావు**,పిటీషనరు తరపు అడ్వకేట్, మట్టుపల్లి కాంప్లెక్స్, గుంటూరు, సెల్: 9849512277



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

## స్వచ్ఛందంగా వస్తేనే పి-4 మార్గదర్శకులుగా ఎంపిక : కలెకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పీ4 పథకంలో భాగంగా బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారిని మాత్రమే మార్గదర్శకులుగా ఎంపిక చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్, అన్నదాతా సుఖీభవ కార్యక్రమాలపై చీఫ్ సెక్రటరీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి. అరుణ్ బాబు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ మార్గదర్శకులుగా చేరాలని ఎవరినీ ఎటువంటి ఒత్తిడికి గురి చేయొద్దన్నారు. తమ అనుభవం, వనరులు ఇతరుల అభివద్ధికి ఉపయోగపడాలనే ఆలోచన, ఆసక్తి ఉన్నవారిని మాత్రమే మార్గ దర్శకులుగా గుర్తించాలని ప్రజలు 100 శాతం సంతృప్తి చెందేలా పౌర సేవలు అందించాలన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో మురళి పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఐక్యవేదిక సభ్యులు

## స్మార్ట్ మీటర్లు వద్దని సంతకాల సేకరణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విద్యుత్తి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం.. స్మార్ట్ మీటరు బిగిం చవద్దని కోరుతూ 31వతేదీ సాయంత్రం 5 గంటలకు కళామందిర్ సెంటర్‌వద్ద, నందిపాడు సెంటర్లో కరపత్రాలు పంపిణీ సంత కాలు సేకరణ చేస్తూ ప్రచార కార్యక్రమం పట్టణ విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక కన్వీనర్ పెరుబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం జరుగుతుంది. ఆగస్టులో విద్యుత్ విని యోగదారులందరూ స్థానిక రిజిస్టర్ కార్యాలయం సమీపంలోని గ్రంధాలయం వద్ద ధర్నా జరుగుతుందన్నారు. అనంతరం విద్యుత్ కార్యాలయాల వరకు ర్యాలీ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రజలు, ప్రజా సంఘాల వారు, ఇతర నాయకులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో టి.ప్రతాప్ రెడ్డి, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## త్వరలో వరికపూడిశెల ప్రాజెక్టు పనుల ప్రారంభం : శ్రీధర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వరికపూడిసెల ఎత్తిపోతల పథకం పూర్తయితే పల్నాడు ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని లక్ష ఎకరాలకు సాగు నీరు 100 గ్రామాలకు పైగా తాగునీరు అందుతుందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొమ్మాలపాటి మాట్లాడుతూ వరికపూడిశెల ఎత్తిపోతల పథకం కింద కేంద్ర అటవీశాఖకు చెల్లించాల్సిన రూ 14.81 కోట్లను చెల్లించకుండా గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాగు ప్రాజెక్టులపై అధ్యయనం చేసి అటవీ శాఖకు రూ.14.81 కోట్లను చెల్లించడంతో తొలి, రెండో దశ నిర్మాణాలకు అవకాశం ఏర్పడిందన్నారు. వరికపూడిశెలతో మాచర్ల, వినుకొండ, ప్రకాశం జిల్లా యర్రగొండ పాలెం నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు పల్నాడు ప్రకాశం జిల్లాల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

# ఉచిత ప్రయాణం పల్లె వెలుగుకు మాత్రమేనా?

### 15 నుంచి ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మహిళల కోసం ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న ఉచితబస్సు ప్రయాణ పథకం అమలుపై పలు అనుమానాలున్నాయి. పూర్తి స్థాయిలో ఖచ్చితమైన నిర్ణయాలను చేయలేదని తెలుస్తోంది. ఈ పథకాన్ని కేవలం జిల్లా వరకే పరిమితం చేస్తూ పల్లె వెలుగు బస్సులకు మాత్రమే అమలు చేసే అవకాశాలున్నాయనే మాటలు వినిపిస్తున్నాయి ఈ నేపథ్యంలో ఉచిత బస్సు పథకం (ఎక్స్‌ప్రెస్, లగ్జరీ, సూపర్ లగ్జరీ డీలక్స్) అన్ని బస్సులో అమలు చేయాలనీ, గతంలో ఇచ్చిన హామీ మేరకు పూర్తి స్థాయిలో అమలు చేయాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. చిలకలూరి పేట నియోజకవర్గ జనాభా మొత్తం దాదాపు 2 లక్షల 50 వేలుగా వున్నారు. వీరిలో మహిళలు లక్ష 35 వేల మంది ఉన్నారు. వీరిలో నియోజకవర్గ స్థాయిలో రోజుకి షుమారుగా 15 వేల మంది తప్పని సరిగా ప్రయాణం చేస్తుంటారు. వీరిలో విద్యార్థినులు వెయ్యి మంది ఉన్నారు. ఇప్పుడు ఉచ్చిత బస్సు అంటే మహిళా ప్రయాణికులు మూడు రెట్లు అయ్యే అవకాశం ముంది. ప్రస్తుతం ఉన్న బస్సులు చా లక రెట్టింపు బస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం, ఆర్టీసీ డిపో చిలకలూరిపేట వారు ఆ దిశగా ఆలోచనలు ఏమి చేస్తున్నట్టు కనిపించడం లేదు. అయితే డిపోలో మొత్తం 77 బస్సులున్నాయి. వాటిల్లో పల్లెవెలుగులు సొంత బస్సులు 40గాను, అద్దెవి 16గా ఉన్నవని ఆర్‌టిసి లెక్కలు చెప్తున్నాయి. ఎక్స్‌ప్రెస్‌లు 16, ఇంద్ర, గరుడా, ఇతర రకాల



ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు

సర్వీసులు ఒకొక్కటిగా ఉన్నాయి. మూడు మండలాల్లో సుమారు 60 గ్రామాలను కలుపుతూ పల్లె వెలుగు బస్సుల తిరుగుతున్నాయి. రోజుకి 57512 కిలోమీటర్లు ఈ డిపో బస్సులు తిరుగుతున్నట్లు, అదే రేషియోలో 30, 35 వేల మంది బస్సులలో ప్ర యాణం సాగిస్తున్నారు. సగటున రోజుకి క్యాష్ రూపంలో సుమారు రూ.11 లక్షల్లోపు వస్తుంది. ఉచిత ప్రయాణాన్ని జిల్లాలో మాత్రమే ఉచితం అమలు చేస్తామంటూ మంత్రులు అనేక సందర్భాల్లో ప్రకటిస్తూన్న నేపథ్యంలో మహిళల నుంచి విమర్శలు వస్తున్నాయి. పరిమితులు లేకుండా ప్రయాణానికి అనుమతివ్వాలని కోరుతున్నారు. మరో వైపు పల్లెవెలుగు బస్సులు పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయనే ప్రచారం జరుగుతోంది. స్త్రీ శక్తిగా నామకరణం చేసిన మహిళకు ఉచిత బస్సు పథకంలో భాగంగా చిలకలూరిపేటలో పల్లె వెలుగులు బస్సులు మరో 20 దాకా పెంచాల్సి ఉంది.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

## అర్హత ఉన్న రైతుకు అన్నదాత సుఖీభవ

### పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకు 'అన్నదాత సుఖీ భవ' పథకం అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లతో 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' పథకం అమలుపై సచివాలయం నుండి వివిధ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు పాల్గొన్నారు. ఈనెల 2న 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' కింద రూ 3174.4 కోట్లను రాష్ట్ర వ్యాప్తంగా 46.86 లక్షల మంది రైతులకు అందిస్తారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్న దాత సుఖీభవ-పిఎం కిసాన్' పథకం మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు చొప్పున అర్హులైన రైతులకు అందిస్తారన్నారు సుఖీ భవ-పిఎం కిసాన్' కార్యక్రమాన్ని జిల్లా, గ్రామస్థాయిలో పండుగ వాతావరణంలో నిర్వహించాలని, ప్రజాప్రతినిధులు, రైతులను భాగస్వాములను చేయాలన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, విత్తనాలు, ఎరువులు పంపిణీ, 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్', మైక్రోఇరిగేషన్ ప్రాజెక్ట్, రాయితీతో సాగులో యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం, రైతులకు వివరించాలన్నారు. జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు సాగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎగుమతులకు అవకాశం ఉన్న పంటలు సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సలహాలు సూచనలు అందజేయాలన్నారు.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో తిమ్మిశెట్టి హనుమంతరావు అధ్యక్షతన క్రోసూరు మండల ప్రజావేదిక ఆధ్వర్యంలో అదాని స్మార్ట్ విద్యుత్ మీటర్లకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై ఎటువంటి విద్యుత్ భారాలు వెయ్యబోమని చెబుతూనే, మరొకపక్క సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15 వేల కోట్లను వసూలు చేసేందుకు సిద్ధమైందన్నారు. అందులో భాగంగా ఇప్పటికే రూ.2750 కోట్లను వసూలు చేశారని అన్నారు. గత ప్రభుత్వాల విధానాల వలనే సర్దుబాటు చార్జీలు వేస్తున్నామని పదేపదే చెబుతున్న కూటమి ప్రభుత్వం, గతంలో వైయస్సార్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో సెకితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు సరైనవి కాదని, పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని కోర్టుకు వెళ్లి మరీ వాదించిన టిడిపి పాలకులు ఇప్పుడు మౌనంగా ఉండటంలో అర్థమేమిటో ప్రజలు ఆలోచించాలని అన్నారు. పైగా గత ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తికి రూ.2.45 పైసలు చెల్లించాలని ఒప్పందం చేసుకుంటే, ఈ ప్రభుత్వం రూ. 4.60 పైసలు చెల్లిస్తామని ఒప్పందం చేసుకోవడంతో కూటమి ప్రభుత్వం, ప్రజల డబ్బును ఏ స్థాయిలో కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చూస్తుందో అర్థమవుతుందని అన్నారు. స్మార్ట్ మీటర్ల తయారు చేసే శ్రీ షిర్డీ సాయి ఎలక్ట్రానిక్స్ కంపెనీతో వైయస్సార్ ప్రభుత్వం పెద్ద ఎత్తున రూ. 1200 కోట్ల అవినీతికి పాల్పడిందని అమెరికా కోర్టులో సాక్ష్యాధారాలతో వాదనలు వినిపిస్తుంటే, అదే కంపెనీ టిడిపి ప్రభుత్వానికి కూడా రూ. 30 కోట్లు ఇచ్చిందని తెలిపారు.అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం అంటే పూర్తిగా విద్యుత్తును ప్రైవేటీకరించడమేనని, ఈ ఒప్పందం 10 సంవత్సరాలు కొనసాగితే పూర్తిగా ప్రైవేటు వ్యక్తి చేతుల్లోకి విద్యుత్ ఉత్పత్తి , సరఫరా, పంపిణీ విభాగాలు కార్పొరేట్ల చేతులలోకి వెళ్లిపోయి, ప్రజలకు ఎటువంటి జవాబుదారీతనం లేని వ్యవస్థ ఏర్పడుతుందన్నారు. ఇలాంటి విధానాలను అధికారంలో ఉన్న టిడిపి, జనసేనతోపాటు ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కూడా మాట్లాడకపోవడం వల్ల ప్రజలు పెద్ద ఎత్తున నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ సందర్భంలో ప్రజలు పార్టీలకతీతంగా వ్యతిరేకించడం ద్వారానే ఈ స్మార్ట్ మీటర్ల భారాలని ఎదుర్కోగలమని అన్నారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు రావెళ్ల వెంకటేశ్వర్లు, ఆవుల ఆంజనేయులు, పోతుగంటి నాగేశ్వరరావు, ఏపూరి వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు నందిగం దాసు, జి.ఎలిసమ్మ , ఎస్.కె జానబీ, కంచేటి పెద్దబ్బాయి, బుర్రిశైదా, శివశంకర్ పాల్గొన్నారు.



డ్రోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

## వ్యవసాయాన్ని లాభసాటి చేసుకోండి

### ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పాడి, పంటలు రైతులకు రెండు కళ్లు లాంటివని తగ్గిపోతున్న పశు సంపదను కాపాడుకుంటూనే సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటి చేసుకోవాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట మండలంలోని ఇక్కుర్రు గ్రామంలో గురువారం ఎమ్మెల్యే డ్రోన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను రైతులు సాగు చేయాలని రైతులకు సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులకు రాయితీపై వ్యవసాయక యంత్ర పరికరాలు అందిస్తుందని అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, ఇక్కుర్రు పిఏసిఎస్ చైర్మన్ కొల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్ఎఫ్ఎస్ఎం పథకంలో ఇక్కుర్రి గ్రామానికి చెందిన రామన్న కిసాన్ డ్రోన్ గ్రూప్ కి 80 శాతం రాయితీతో డ్రోన్ పంపిణీ చేశారు. డ్రోన్ రూ 9.80 లక్షలు కాగా, ఇందులో 80శాతం (రూ.7.84 లక్షలు) రాయితీపోగా 20శాతం (రూ.1.96 లక్షలు) బ్యాం కురుణం మంజూరు చేసిందన్నారు. ఏడిఏ కెవి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్ఎఫ్ఎస్ఎం కింద రైతులకు 12 క్వింటాళ్ల కందులు, 10క్వింటాళ్ల మినుములు (ఉచితంగా) 100శాతం రాయితీపై అందించామన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి శాంతి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బొడ్డపాటి పేరయ్య, టిడిపి నాయకులు కొల్లి బ్రహ్మయ్య, కూరపాటి శ్రీనివాసరావు, టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విఆర్‌ఒకు ఉద్యోగవిరమణ సత్కారం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

చాగంటివారిపాలెం విఆర్వో షేక్ మాబువలి ఉద్యోగ విరమణ అభినందన సభ మండలంలోని ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో విఆర్వో మాబువలి దంపతులను ముప్పాళ్ల తహశీల్దార్ నగేష్ మరియు రెవెన్యూ సిబ్బంది శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఆత్మీయ అభినందన సభలో తహశీల్దార్ నగేష్ మాట్లాడుతూ 27 సంవత్సరాల తన విధులలో ఎంతో నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని బాధ్యతయుతంగా వ్యవహరించారని తెలిపారు. ఆయన శేష జీవితం సుఖసంతోషాలతో గడపాలనీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్ తహశీల్దార్ సరోజ, డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐలు, సీనియర్‌అసిస్టెంట్, విఆర్వోలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

## ఉద్యోగుల రక్తదానం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్ నగేష్ పాల్గొని మాట్లాడుతూ కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ చైర్మన్ యం.ఆర్ శేషగిరిరావు సహకారంతో మండలంలోని విఆర్‌ఓ, వీఆర్‌ఏ, ప్రభుత్వ సిబ్బంది సహకా రంతో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. వైస్‌చైర్మన్ కె.ఎం.యన్.వి శ్రీనివాసగుప్త పాల్గొని మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమనీ, రక్తదానం ద్వారా ప్రాణాన్ని కాపాడటమంటే ఒక కుటుంబాన్ని కాపాడడమని అర్థం అన్నారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన తహశీల్దార్ నగేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. 18 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. డాక్టర్ సృజన, మేనేజింగ్ కమిటీసభ్యులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, ప్రభుత్వ, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికుల పోరాట ఫలితమే పింఛను పునరుద్ధరణ


స్వీట్లు పంచుకుంటున్న సిఐటియు నాయకులు రవి, పారిశుధ్య కార్మికులు

**ప్రజాశక్తి - తుళ్లూరు**

సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులంతా ఐక్యమై పట్టు వదలకుండా పోరాటం చేయడం వల్లే ప్రభుత్వం రాజధాని సామాజిక పెన్షన్‌ను పునరుద్ధరించిందని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి అన్నారు. గురువారం రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో సిఐటియు నాయకులు,పారిశుధ్య కార్మికులు స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి రవి మాట్లాడుతూ ఆగస్టు 1న రాజధాని పారిశుధ్య కార్మికులతో పాటు, అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టులలో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికులు, అంగన్వాడీలు, ఆశాలు సామాజిక ఫెన్షన్‌ను తీసుకోనున్నట్లు చెప్పారు. సామాజిక పెన్షన్‌ను పునరుద్ధరించేంత వరకు పోరాడిన కార్మికులకు, 121 జీవో ద్వారా పునరుద్ధరించిన ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు, కమిషనర్ కన్నబాబు, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్మికులకు జీతాలు కూడా పెంచాలని ఈ సందర్భంగా రవి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం జనవరి నుండి పెన్షన్ ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు జనవరి నుండి 7 నెలల పెన్షన్ బకాయిలు ఒకేసారి చెల్లించాలని కోరారు. సాంకేతిక కారణాలతో అర్హత ఉండి కూడా లిస్టులో పేర్లు లేని కార్మికుల వివరాలను పరిశీలించి వారికి కూడా సామాజిక పెన్షన్ అందేలా సిఆర్‌డిఎ అధికారులు తగు చర్యలు చేపట్టాలని రవి కోరారు. రాజధానిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టులలో పనిచేస్తున్న కార్మికులకు కేవలం రూ.12 వేల జీతంతో సరిపెడుతున్నారని, వీరికి మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న విధంగా 36 జీవో ప్రకారం రూ.21 వేలు జీతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రవి కోరారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు కుంభా గోపిరాజు, లేళ్ల సుఖవేణి, వెలగలేటి బుజ్జి, ఎన్.వీర్లంకమ్మ, జెట్టి మరియమ్మ, రజిని, విజయ్‌కుమార్, ఎన్.కోటేశ్వరరావు, మేకల మేరీ, నాగమణి, సిఐటియు నాయకులు పేరం బాబురావు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, క్లాప్ ఆటోడ్రైవర్లు

## క్లాప్ ఆటో డ్రైవర్లను పనిలోకి తీసుకోవాలని ధర్నా

**ప్రజాశక్తి - మంగళగిరి**

ఆపిన క్లాప్ ఆటో డ్రైవర్లను పనిలోకి తీసుకోవాలని, ఎం బుక్ కార్మికుల వేతనాల్లో కాంట్రాక్టర్ దోపిడీని నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కార్పొరేషన్ కార్యాలయం గేటు ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య, వి.వి.జవహర్‌లాల్, ఎం.బాలాజీలు మాట్లాడుతూ గత సంవత్సరాలుగా కార్పొరేషన్ పరిధిలో క్లాప్ ఆటో డ్రైవర్లు పనిచేస్తున్నారని అన్నారు. ఈనెల 29వ తేదీ నుండి పని నుండి ఆపారని అన్నారు. తిరిగి పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జీతాలలో నుంచి పిఎఫ్, ఈఎస్ఐ పేరుతో కటింగ్ చేసి జమ చేయడం లేదని అన్నారు. ఎం బుక్ పారిశుధ్య కార్మికులకు కాంట్రాక్టర్ నెలకు 15000 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా పదివేల రూపాయలు ఇస్తున్నారని అన్నారు. 5000 రూపాయలు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పండుగ, ఆదివారం రోజుల్లో సెలవులు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. వీరికి కూడా పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనం బ్యాంక్ అకౌంట్లో వేయాలని కోరారు. అనంతరం కార్పొరేషన్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కాగా క్లాప్ ఆటో డ్రైవర్లు ధర్నాకు దిగడంతో పనిలోకి తీసుకుంటామని కాంట్రాక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళనలు విరమించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, వై.కమలాకర్, క్లాప్ ఆటో డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు రవి, శివ, ఎం బుక్ కార్మికులు కె.వెంకటరమణ, ఎం.అంకమ్మ, కె.పుణ్యవతి, రజిని, దివ్య, రమాదేవి పాల్గొన్నారు.


## వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలి : సిఐటియు


కెవిపిఎస్ పట్టణ మహాసభలో మాట్లాడుతున్న చెంగయ్య

**ప్రజాశక్తి - మంగళగిరి**

సమాజంలో జరుగుతున్న వివక్షకు వ్యతిరేకంగా దళితులు, గిరిజనులు ఐక్యంగా ఉండి ఉద్యమించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య అన్నారు. గురువారం సాయంత్రం మంగళగిరి కెవిపిఎస్ కార్యాలయంలో పట్టణ మహాసభ జరిగింది. సభకు బి.స్వామినాథ్ అధ్యక్షత వహించారు. చెంగయ్య మాట్లాడుతూ సమాజం సాంకేతిక పరంగా అభివృద్ధి చెందిందన్నారు. అయినా సమాజంలో కుల వివక్షత కొనసాగడం దారుణమైన అన్నారు. ఇప్పటికీ పట్టణాల్లో దళితులకు ఇల్లు అద్దెకి ఇవ్వడం లేదన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు మాట్లాడుతూ మంగళగిరి పట్టణంలో గిరిజనులు వివక్షతకు గురవుతున్నారన్నారు. అధికార యంత్రాంగం దొంగల పేరుతో ప్రతిసారి కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్న పరిస్థితులు నేటికీ కొనసాగుతున్నాయని అన్నారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ మాట్లాడుతూ కెవిపిఎస్ సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. కెవిపిఎస్ నాయకులు జె.నవీన్ ప్రకాష్ దళితులకు స్మశాన స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎనిమిది మందితో నూతన కెవిపిఎస్ పట్టణ కమిటీ ఎన్నికయింది. అధ్యక్ష కార్యదర్శులుగా కె.జోసెఫ్, వై.కమలాకర్, కోశాధికారిగా బి.స్వామినాథ్, ఉపాధ్యక్షులుగా జె.బ్రాహ్మణి, సహాయ కార్యదర్శిగా ఈ.విజయలక్ష్మి, కమిటీ సభ్యులుగా ఈగ సాంబయ్య, ఎస్.కోటేశ్వరరావు, కె.బుజ్జిబాబులను ఎన్నుకున్నారు.

## స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని ఇంటింటికి కరపత్రాలు పంపిణీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు రామకృష్ణ

**ప్రజాశక్తి -మేడికొండూరు**

విద్యుత్ స్మార్ట్ మీటర్ల వ్యవస్థను నివాసాలకు బిగించకుండా ఆపివేయాలని గురువారం మేడికొండూరులో సిపిఎం మండల కార్యదర్శి బోట్ల రామకృష్ణ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగించితే పగలగొట్టండని ప్రచారం చేశారు అని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అవే స్మాట్ మీటర్లను ప్రభుత్వ ఆఫీసులకు, వ్యాపార సంస్థలకు బిగించారని తెలిపారు. మనం ఏదైనా కంప్లైంట్ చేయవలసి వచ్చినచో ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది, ఇప్పటికే గత ప్రభుత్వం వేసిన అదనపు చార్జీల కన్నా, ఇంకా ఎక్కువ వేసి వేల కోట్లు వసూలు చేసే పన్నాగంలో ఉన్నారని అన్నారు. స్మాటర్ట్ మీటర్లు బిగించకుండా ప్రజలు ఉద్యమంలోకి వచ్చి సంతకాలు సేకరించి మేడికొండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలపాలని కోరారు.

# స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని తక్షణమే ఆపాలి



విద్యుత్ బిల్లులను పరిశీలిస్తున్న సిఐయుటి నాయకులు ఎం.రవి, దుగ్గిరాలలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని తక్షణమే నిలిపివేయాలని, విద్యుత్ బిల్లులు అధికంగా రావడంతో నవులూరులో విద్యుత్ బిల్లులను సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఉద్యోగులు అనే పేరుతో ఎస్సీ, ఎస్టీలుగా ఉన్న మున్సిపల్ కార్మికులకు 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్తు ఇవ్వాల్సింది పోయి వారికి కూడా బిల్లులు వేయటం అన్యాయమని అన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వం మాట తప్పి విద్యుత్ ఛార్జీల భారాన్ని పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని అన్నారు. విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని పీకల లోతు అవినీతిలో కూరుకుపోయిన గౌతమ్ ఆదాని లాంటి బడా కార్పొరేట్లకు దారా దత్తం చేయబోతుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండని చెప్పి ,తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు పెట్టడానికి వచ్చిన వారిపై వినియోగదారులు కేసులు పెట్టాలని కోరారు.

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

స్మార్ట్ మీటర్లను బిగింపును తక్షణమే ఆపాలని, ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని ట్రూ ఆప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని ఇప్పటికే అదనంగా వసూలు చేసిన 2,787 కోట్లు వినియోగదారులకు తిరిగి చెల్లించాలని ఈరోజు దుగ్గిరాల సెంట్రల్ వేరు హౌస్, ముఠా కూలీల వద్ద కరపత్రాలు పంచి మాట్లాడారు. ఈ సందర్భంగా జెట్టి బాలరాజు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఇప్పటికే ప్రజానీకం భారీ స్థాయిలో విద్యుత్ బారాలను మో స్తున్నారని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యుత్ బారాలను మరింత మోపటం కోసం విద్యుత్‌స్మార్ట్ మీట్లను బిగుస్తున్నుందని మీటర్లను బిగించుకోవద్దనీ, చెప్పారు. కార్యక్రమంలో ఎం.మరియదాసు, ఎం.పున్నా రావు, క.యలమంద, ఎన్.బాబురావు, ఎం.మరిదాసు, ఎం.అనిల్ కుమార్, కె.మనోజ్ పాల్గొన్నారు.


కృష్ణా నదికి క్రమంగా పెరుగుతున్న నీటి ప్రవాహం

## కృష్ణానది పరీవాహక గ్రామాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

అధికారుల ఆదేశాలు కచ్చితంగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహశీల్దార్ ఐ.సునీత మండల స్థాయి అధికారులను కృష్ణానది పరీవాహక గ్రామాల అధికారులను సిబ్బందిని ఆదేశించారు. కృష్ణ నదికి నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతుండటంతో గురువారం నది పరీవాహక గ్రామాలలో ఆమె పర్యటించారు. పశువులను మేత కోసం లంకలకు తోలుకొని వెళ్లవద్దని దండోరా వేయించారు. నీటి ప్రవాహం ఇంకా పెరిగినట్లయితే లోతట్టు ప్రాంతాలను ఖాళీ చేయించాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితి సమీక్షించుకుంటూ ఉండాలని కోరారు. గురువారం సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో కృష్ణ బ్యారేజ్ నుండి క్రిందికి వదులుతున్న నీరు 2,72,750 క్యూసెక్కులని జలవంతరుల శాఖ అధికారులు తెలిపారు.

## స్మార్ట్ మీటర్ల పేరుతో బాదుడే బాదుడు


మాట్లాడుతున్న శ్రీనివాస్‌కుమారి

**ప్రజాశక్తి- తాడేపల్లి**

కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై పెద్ద ఎత్తున ధారాలు మోపి బాదుడుకు తెరలైపోయిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు దొంతి రెడ్డి శ్రీనివాస్ కుమారి విమర్శించారు. గురువారం సాయంత్రం తాడేపల్లి పట్టణంలోని సీతానగరం గోరా కాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ప్రాంతంలో స్మార్ట్ మీటర్లు వద్దంటూ సిపిఎం ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుమారి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఒకేరోజులో సమయాన్నిబట్టి మూడు రకాలుగా విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో 13వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు మోపారు అని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల అప్రమత్తంగా ఉండి మీటర్లు బిగించడానికి ఇంటికి వస్తే వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.గిరిజ, కె.మేరీ, సామేలు, కొండలు పాల్గొన్నారు.

## మహిళలకు వైద్య వరప్రసాదిని సుధా హాస్పిటల్



**ప్రజాశక్తి- తాడేపల్లి**

స్థానిక సుధా హాస్పిటల్ మహిళలకు వైద్య వరప్రసాదిని అని అడ్వాన్స్డ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ బుద్ధిగం అంజలి అన్నారు. బైపాస్ రోడ్‌లో ఎస్పీస్ రివర్ వ్యూ అపార్ట్మెంట్లో మూడంతస్తుల్లో సుధా హాస్పిటల్ అందిస్తున్న వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. 24/7 సేవలు అందుబాటులో ఉన్నాయనాన్నరు. విజయవాడ, గుంటూరు, తెనాలి లాంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటున్నాయి అని డాక్టర్ అంజలి తెలిపారు. అత్యవస ర జనరల్ సర్జరీ తో పాటు రొమ్ములో గడ్డలు, కాళ్లలో దీర్ఘకాలిక పుండ్లు (షుగరు,pad), పసరు సంచిలో రాళ్లు, 24 గంటలు కడుపులో నొప్పి, హెర్నియా ఆపరేషన్లు అత్యంత సులువుగా వైద్య సేవలు అందించబడతాయని పేర్కొన్నారు. మొలల లూటీలు, కాళ్ళ నరాల వాపు, ఓరి బీజం, థైరాయిడ్ ( గ్రంధి వాపు లు), గోరుచుట్టు, మూలశంక, చీము గడ్డ లు, కొవ్వు గడ్డలు, చెవి తమ్మె రిపేరు తదితర వ్యాధులకు సులభమైన రీతిలో, తక్కువ ఖర్చుతో వైద్యం అందించడం జరుగుతుందని తెలిపారు. లేజర్ దిరిపి , నరాల వాపు, ఫైల్స్, ఉబ్బిన సిరలు, బడ్డు వాపు, మొలలు లేదా మూల వ్యాధి లాంటి వ్యాధులకు కూడా చికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.


సుధారాణికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

## బాధ్యతలు స్వీకరించిన సుధారాణి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ముప్పాళ్ల మండల విద్యాశాఖాధికారి-1గా పోలినేని సుధారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన ఆమె పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను ముప్పాళ్ల జెడ్పీ పాఠశాల లెక్కల ఉపాధ్యాయులు కోంజేటిసాయి జగన్నాథరావు, యుటిఎఫ్ ఉపా ధ్యాయ సంఘం నాయకులు మువ్వాసురేష్, కొమరిశెట్టి విజయ్, ఎస్టీయు ఉపాధ్యాయ సంఘం నాయకులు పెరుమాళ్ళ రామారావు, వెంకట్రావు, రాధాకృష్ణ, ఎన్‌టిఏ ఉపాధ్యాయ సంఘం నాయకులు కాసరబాద నాగేశ్వరరావు, బుల్లిబాబు, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు బుల్లిబాబు, ఐతమ్‌రాజు, శ్రీనివాసరావు సత్కరించి అభినందనలు తెలియజేశారు.


వస్త్రదుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

## రామ్ రాజ్ కాటన్‌స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని మోర్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్‌రాజ్‌కాటన్ వస్త్ర దుకాణాన్ని గురువారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారం భించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో నాణ్యత, విశ్వసనీయతకు ప్రసిద్ధి గాంచిన రామ్ రాజ్ స్టోర్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్టోర్‌లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిం చాలని కోరారు. కార్యక్రమంలో స్టోర్ నిర్వాహకులు వేముల వెంకటేశ్వరరావు, డాక్టర్ కస్తూరి విషాల్, కటకం జగదీశ్వర్, టిడిపి నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవీంద్రబాబు, నల్లపాటి రామంద్రప్రసాద్, కపలవాయి విజయ్ కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా, ఛాంబర్ అధ్యక్షులు వనమా సాంబశివరావు, రామ్రాజ్ కాటన్ సంస్థ ప్రతినిధులు శశీంద్రన్ నాయర్,


ప్రైజ్‌మనీ అందుకున్న విద్యార్థులతో చాంద్‌పాషా

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రైజ్‌మనీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విజయపూర్ సౌత్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రతి తరగతిలో ప్రధమ, ద్వితీయ ర్యాంకులు తెచ్చుకున్న విద్యార్థులకు బిగ్ హెల్ప్ సంస్థ చైర్మన్, ఫౌండర్ అయిన చాంద్‌పాషా తల్లిదండ్రులు, అన్నయ్య పేరుమీద ప్రైజ్ మనీను ప్రధానోపా ధ్యాయురాలు డి.జ్యోతి అధ్యక్షతన విద్యార్థులకు అందజేశారు. 20 మంది బిగ్ హెల్ప్ విద్యార్థు లకు స్టేషనరీ ఐటమ్స్‌ను జూలై నెలకి సంబంధించి అందజేశారు. బిగ్‌హెల్ప్ సంస్థ దత్తత తీసు కున్న అన్ని పాఠశాలలలో ఈ సంవత్సరం నుండి గోల్డెన్ స్టార్ అవార్డు ప్రవేశపెట్టారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన, తల్లిదండ్రులు లేని విద్యార్థులను దత్తత తీసుకొని ప్రోత్సహించటం, అవార్డులను అందిపుచ్చు కొని విద్యార్థులు చదువులో రాణించాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వ్యాపారుల కోసం ప్రజల ఆస్తుల్ని పోగొట్టుకోలేం

### కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్

ప్రజాశక్తి - మాచర్ల



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్

ప్రజల ఆస్తుల్ని పదిమంది వ్యాపారుల కోసం పోగొట్టుకోలేమని మాచర్ల మున్సిపల్ చైర్మన్ మదర్‌సాహెబ్ అన్నారు. మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్మన్ మదర్‌సాహెబ్ అధ్యక్షతన గురువారం జరిగింది. మున్సిపల్ ఆస్తులను చూసీచూడనట్లు వదిలేయడం సరి కాదని మాయాబజార్ షాపుల అద్దె సంగతి అధికారులు వెంటనే తేల్చాలని మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్ అన్నారు. ఒకటి తప్ప ఎజెండాలోని అంశా లన్నీ ఏకగ్రీవంగా ఆమోదించారు. అజెండాలోని మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయ వాదిగా ఏర్పాటు చేసుకునేందుకు వచ్చిన పేర్లలో కాకుండా మరికొన్ని పేర్లను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆ అంశాన్ని వాయిదా వేశారు. టిడ్కో ఇళ్లపై కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నకు కమిషనర్ వేణుబాబు సమాధానం చెబుతూ టిడ్కో గృహ సముదాయాలు వద్ద మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.1000 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కౌన్సిలర్ సుభాని మాట్లాడుతూ వైసిపి హయాంలో టిడ్కో లబ్ధిదారుల్లో కొంత మందిని తొలగించి వైసీపీకి చెందిన వారిని చేర్చడం జరిగిందన్నారు. అవన్నీ పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక చేయాలని కమిషనరును కోరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ పోలూరు నరసింహారావు తమ వార్డులో కుక్కల సమస్య బాగా ఎక్కువగా ఉందన్నారు. కుక్కలను పట్టి చంపటం కుదరదని వాటిని పట్టుకొని వ్యాక్సినేషన్ చేసి వదిలివేయడం చేస్తున్నామని, పిచ్చి కుక్క విషయంలో దానిని పట్టుకొని ఊరు బయటకు తరలించే ఆలోచన చేస్తామని కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్ సుభాని సాహెబ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పురపాలక సంఘ అభివృద్ధికి కేటాయించిన రూ.మూడు కోట్లను పట్టణ శివారు ప్రాంతాలలో అభివృద్ధి పనులకు వెచ్చించడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. పట్టణంలో అనాథరైజ్డ్ వెంచర్స్ పెరుగుతున్నా యని తన పొలానికి వెళ్లే బాటను మూసేసి గోడ కట్టేసారని, పురపాలక సంఘంలో చెప్పుకుంటే నా సమస్య పరిష్కారం కాలేదని, వెంటనే ఆ సమస్య పరిష్కరించాలని కమిషనరు ను కోరారు. చివరగా మున్సిపల్ చైర్మన్ మాట్లా డుతూ పట్టణంలో పురపాలక సంఘానికి చెందిన మాయా బజార్ షాపుల నిర్వాహకులు కోర్టుకు వెళ్లి అద్దెలు చెల్లించకుండా సమస్యలు సృష్టిస్తున్నారనీ, వెంటనే ఆ సమస్యపై పరిశీలించి పురపాలక సంఘానికి ఆదాయం వచ్చే ఆలోచన చేయాలని కమిషనరును కోరారు. రామాటాకీస్ లైన్‌లో వ్యాపారులు రోడ్డున ఆక్రమించారని. అధికారులు దానిపై సర్వే జరిపి, ఆ రోడ్డు వెడల్పు ఎంత వ్యాపారులు ఎంత ఆక్రమించుకున్నారో లెక్కలు తేల్చాలని కమిషనరును కోరారు. సమావేశంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోండి

### కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఎన్నికల్లో చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు


ఎన్నికల ప్రకియను వివరిస్తున్న నాతాని వెంకటేశ్వర్లు


ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని అప్పుడే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని కె-రిడ్జ్ ఇంటర్ నేషనల్ స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ గ్రామ పరిధిలో గల కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ లో గురువారం స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్ సంబంధించి నిర్వహించిన ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికల తరహాలో జరిగాయి. ఎన్నికల లో నిలబడదలిచిన వారు నామినేషన్లు వేయడం, ఎన్నికల ప్రచారం నిర్వహించడం, పోలింగ్ బూత్ల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సుల ఏర్పాట్లు, ఎన్నికల అధికారులు, పోలైన ఓట్ల లెక్కింపు అన్ని పూర్తి స్థాయిలో సాధారణ ఎన్నికలను తలపించాయి.ఓటు హక్కు అనే బలమైన ఆయుధంతో ప్రతినిధులను ఎన్నుకోవటం ద్వారా ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని, ఈ క్రమంలోనే పాఠశాలలో కూడా ఎన్నికల నిర్వహణ ద్వారా విద్యార్థులు స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ ఎన్నుకోవటం జరిగిందని స్కూల్ చైర్మన్ నాతాని తెలిపారు. విద్యార్థులకు ఎన్నికల పట్ల పూర్తి అవగాహన పెంపొందించడంతో పాటు విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవటానికి, దేశంపట్ల, సమాజం పట్ల భాద్యత కలిగిన పౌరులుగా ఉండటానికి ఇటువంటి ఎన్నికలు దోహదం చేస్తాయన్నారు. ఎన్నికల నిర్వహణలో చీఫ్ఎలక్షన్ కమిషనర్‌గా టి.విజయ రాజు, అసిస్టెంట్ ఎలక్షన్ కమిషనర్‌గా హేమలత వ్యవహరించారు. మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసి ప్రతి పోలింగ్ బూత్‌లో ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ సిబ్బందిని నియమించారు. స్కూల్ డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇంచార్జి కోటబాపూజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

## జిల్లాలో క్రీడాభివృద్ధికి బాటలు

### ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా జూడో అసోసియేషన్ ఏర్పాటుతో క్రీడాభివృద్ధికి బాటలు వేశారని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం వినుకొండ రోడ్లోని జూపల్లి స్ప్రెసెస్ హోటల్‌లో పల్నాడు జిల్లా జోడో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జనరల్ బాడీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాల్లో క్రీడాకారులకు 3శాతం రిజర్వేషన్లతో ఎటువంటి ఇంటర్వ్యూ, రాత పరీక్ష లేకుండా ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో అవకాశం కల్పించిందన్నారు.పల్నాడు, గుంటూరు జిల్లాల ఉమ్మడి క్రీడాధికారి నరసింహారెడ్డి మాట్లాడుతూ కుల, మతాలకతీతంగా ప్రోత్సహించేది క్రీడా శాఖ అని అన్నారు. జూడో రాష్ట్ర అధ్యక్షులు గణేష్ సుబ్బారావు, సీఈఓ నామిశెట్టి వెంకట్ మాట్లాడుతూ జూడో భారతదేశంలో విస్తరణకు జెఎఫ్ఐ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఢిల్లీ, ముంబై, చెన్నై, కలకత్తాలో జూడో శిక్షణ కేంద్రాలు స్థాపించబడ్డా యన్నారు. 1988లో జూడో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసి) ద్వారా ఒలింపిక్ క్రీడగా గుర్తింపు పొందడంతో భారతదేశంలో ఆదరణ పెరిగిందన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక**

పల్నాడు జిల్లా బ్యూరో అసోసియేషన్ అధ్యక్షులుగా పసుపులేటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కొప్పుల పార్వతి, జనరల్ సెక్రెటరీ కొప్పుల నరసింహారావు, జాయింట్ సెక్రటరీ బి.బాలమురళీకృష్ణ, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని వాగ్దేవి విద్యాసంస్థల అధినేత రాయల శ్రీనివాసరావు సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కపలవాయి విజయ్‌కుమార్, సంజీవరావు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## గంబూషియా చేపలు విడుదల

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

దోమల నియంత్రణకు మాచర్ల మున్సిపల్ మంచినీళ్ళ క్వారీలో మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు గురువారం గంబూషియా చేపలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ చేపలు వేగంగా సంతానోత్పత్తి చేస్తాయని, దోమల లార్వాలను తింటాయని, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వ్యాధులను కలిగించే దోమలు పుట్టకుండా చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మలే రియా సబ్‌యూనిట్ ఆఫీసర్స్ లక్ష్మయ్య, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## బాలమద్దయ్యకు నివాళి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల పట్టణంలోని 3వ వార్డు, నెహ్రునగర్ 1వ లైన్‌లో నివాముండే టీడీపీ కార్యకర్త పందిపోటు బాల మద్దయ్య అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కుమా రుడు గౌతమ్‌రెడ్డి ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఖర్చుల నిమిత్తం రూ.10వేలను ఆర్థిక సాయం చేశారు. బాలమద్దయ్య కుటుంబాన్ని పరామర్శించి, పార్టీ అండగా వుంటుందని చెప్పారు. నివాళులు అర్పించిన వారిలో మాచర్ల పట్టణ టిడిపి అధ్యక్షులు కొమెర దుర్గారావు, శివ ఉన్నారు.

## 181 కొత్త పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి - అచ్చంపేట

అచ్చంపేట మండలంలో 181 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఇన్చార్జి ఎంపీడీవో ఏ రమేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో పింఛన్లు పొందుతూ మృతి చెందిన వారి స్థానంలో వారి భార్యలకు స్పౌజు పెన్షన్లు 181 మంజూరయ్యాయని తెలిపారు. ఆగస్టు 1వ తేదీన కొత్త పెన్షన్ దారులకు ఆయా గ్రామాలలో లబ్ధిదారుల ఇంటి వద్ద వాటిని అందజేస్తారని పేర్కొన్నారు. నూతనంగా మంజూరైన 181 పెన్షన్లు కలిపి మొత్తం 9022 పెన్షన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.


మాట్లాడుతున్న గౌతమ్‌రెడ్డి

## 5వ ర్యాంకు పట్ల హర్షం

ప్రజాశక్తి - మాచర్ల

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించి మాచర్ల నియోజక వర్గాన్ని స్టేట్ 5వ ర్యాంకులో నిలిపిన తెలుగుదేశం పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డి అభినందనలు తెలిపారు. గురువారం మాచర్ల మున్సిపాలిటీ సమావేశ మందిరంలో కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు గౌతమ్ జూలకంటి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# వార్డుల్లో సమస్యలపై నిలదీసిన సభ్యులు

- నామమాత్రంగా అధికారుల సమాధానాలు
- బదిలీల్లో అక్రమాలపై చర్యలేవని నిలదీత

ప్రజాశక్తి - తెనాలి

కౌన్సిల్ సమావేశంలో వార్డులో సమస్యలపై అధికారులను నిలదీయడం సభ్యుల వంతైతే, తూతూ మంత్రంగా సమాధానాలు చెప్పి దాటవేయడం అధికారుల వంతైంది. మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన గురువారం కౌన్సిల్ హాలులో సాధారణ సమావేశం జరిగింది. ఎస్సీ రిజర్వుడు వార్డుల్లో పనులు జరగటంలేదని మునిసిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణితో పాటు 14వ వార్డు కౌన్సిలర్ దాసరి వీర వసంతరావు కౌన్సిల్లో ఆరోపించారు. అలాగే నాలుగో వార్డ్ కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, మూడో వార్డు కౌన్సిలర్ ఆవుల కోటయ్య, 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు వార్డులలో సమస్యలను ప్రస్తావించారు. పారిశుద్ధ్యం పడకేసిందని వార్డులో ఇద్దరు ముగ్గురు కంటే పారిశుద్ధ్య కార్మికులు పనిచేయడం లేదని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. చైర్ పర్సన్ జోక్యం చేసుకొని 29 మంది పారిశుధ్య కార్మికుల నియామకానికి చర్యలు తీసుకుంటున్నామని పరిస్థితి మెరుగుపడుతుందని చెప్పారు. అలానే వైసీపీ కౌన్సిలర్ తాడిపోయిన రామయ్య మాట్లాడుతూ పురపాలక సంఘంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, సచివాలయ ఉద్యోగుల బదిలీలలో అక్రమాలకు ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోలేదో చెప్పాలని నిలదీశారు. అలానే విధులకు హాజరు కాని సిబ్బందికి కూడా జీతాలు క్రమంగా చెల్లిస్తున్నారని, సిబ్బంది హాజరు పట్టీలు తెప్పిస్తే విషయం అర్థం అవుతుందని చెప్పారు. దీంతో కమిషనర్ హాజరు పట్టీలను తెప్పించి చైర్పర్సన్ వద్ద ఉంచారు. తాడిబోయిన రామయ్య హాజరు పట్టీలను పరిశీలించి చైర్పర్సన్‌కు వివరించారు. అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకొని పరిశీలిస్తామని చైర్‌పర్సన్ వెల్లడించి, అజెండా అంశాలను ఆమోదిస్తున్నట్లు ప్రకటించడంతో సమావేశం ముగిసింది. ప్రతి సమావేశంలో జరుగుతున్న విధంగానే ఈ దఫా కూడా కౌన్సిలర్లు సమస్యలు లేవనెత్తడం, వాటికి అధికారులు నామమాత్రంగా సమాధానం చెప్పడం, సమావేశం ముగించడం అంతా పరిపాటిగా మారిందని పలువురు సభ్యులు వాపోయారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో-ఆపర్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.




సిబ్బంది హాజరు పట్టీని పరిశీలిస్తున్న కౌన్సిలర్, కౌన్సిల్‌లో మాట్లాడుతున్న సభ్యులు



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

## 240వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 24వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలలో షేక్ ఇమాంబి, వై,రమాదేవి, ఈదులముడి శారమ్మా, బత్తుల భూలక్ష్మి, అల్లం విజయశ్రీ కూర్చున్నారు. దీక్షలను సీఐటీయూ నాయకులు వి. దుర్గారావు, కార్మిక నాయకులు, కె.స్టీవెన్, ఆదినారాయణ, నారదాసు సుబ్బారావు, ఎం.ఆశీర్వాదాం, వై. సాంబశివరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కె.అగ్గయ్య, పిచ్చయ్య, సుభాని, వి.గంగాధర్, డి.మాణిక్యారావు, బి.అంకయ్య, తుపాకుల నాగేశ్వరరావు, ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న ఉపాధ్యాయులు

## బల్లి పడిన ఆహారంతిని ఉపాధ్యాయులకు అస్వస్థత

ప్రజాశక్తి - తెనాలి

ఆహారంలో బల్లి పడిన కారణంగా శిక్షణలో ఉన్న ఉపాధ్యాయులు అస్వస్థతకు గురయ్యారని ఎంఇఒ-2 వి.జయంతిబాబు చెప్పారు. చికిత్స పొందుతున్న వారిలో ఐదుగురు వైద్యుల పరిశీలనలో ఉన్నారని, మిగతావారంతా డిశ్చార్జ్ అయి, శిక్షణ యతావిధిగా కొనసాగుతున్నట్లు ఎంఇఒ-2 వి.జయంతిబాబు చెప్పారు. కస్తూర్బా విద్యాలయాల ఉపాధ్యాయులకు స్థానిక జెఎంజె మహిళా కళాశాలలో శిక్షణిస్తున్నారు. వీరికి జెఎంజె కళాశాలలో వసతి ఏర్పాటు చేశారు. శిక్షణ అనంతరం బుధవారం రాత్రి వారంతా భోజనం చేశారు. అయితే 15 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారిని స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. భోజనంలో బల్లి పడిన కారణంగా ఆహారం విషతుల్యమై అస్వస్థతకు గురైనట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎంఈఓ తెలిపారు. భోజనం సరఫరా చేస్తున్న ప్రైవేట్ క్యాటరర్‌పై చర్యలు తీసుకుని, అతనిని తొలగించినట్లు చెప్పారు. కాగా జెఎంజె కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శాంత మాట్లాడుతూ ఉపాధ్యాయుల అస్వస్థతకు సంబంధించి తమకు సంబంధం లేదని, వసతి మాత్రమే కల్పించామని, వారికి భోజనం ప్రైవేట్ వ్యక్తులు బయట నుంచి అందిస్తున్నారని తెలిపారు.

## అగ్ని ప్రమాదాలపై కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి రాజధాని నిర్మాణ పనులలో పనిచేస్తున్న కార్మికులు అగ్ని ప్రమాదాలపై అనుక్షణం అప్రమత్తత కలిగి ఉండాలని గుంటూరు జిల్లా అగ్నిమాపక అధికారి శరత్ బాబు సూచించారు. గురువారం రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో ఆర్‌విఆర్ క్యాంపులో రహదార్లు, భవనాలలో పనిచేస్తున్న కార్మికులకు నిర్మాణ ప్రదేశాలలో తలెత్తే అగ్ని ప్రమాదాలపై సిఆర్‌డిఎ, ఎడిసి ఈఎస్‌ఎంయూ విభాగం-1 ఆధ్వర్యంలో అవగాహన, మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ బాబు మాట్లాడుతూ లేబర్ క్యాంపుల్లో ఉండే కార్మికులు గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పొయ్యి వెలిగించి ఇతర పనులపైకి దృష్టి మళ్లకుండా జాగ్రత్త పడాలన్నారు. క్యాంపు నుంచి పని ప్రదేశాలకు బయలుదేరినప్పుడు సిలిండర్ ఆఫ్ చేసి వెళ్లాలన్నారు. కట్టెల పొయ్యిల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. పని ప్రదేశాలలో అకస్మాత్తుగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే కార్మికులు ఏవిధంగా స్పందించి మంటలు అదుపుచేయాలో వారితో మాక్‌డ్రిల్ చేయించారు. ఈ మాక్‌డ్రిల్‌లో అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు, ఈఎస్‌ఎంయూ విభాగం -1లేబర్ అధికారి ఎం వెంకటేశ్వర్లు, గ్రీవెన్స్ అధికారి జి.వెంకటేష్, సేఫ్టీ - ఎన్విరాన్‌మెంట్ అధికారులు వి.హరికృష్ణ, ఎం.ఆరోన్ పాల్, సంగీత, ఆర్‌విఆర్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి శరత్‌బాబు

## బాలల న్యాయానికి భారత రాజ్యాంగం గట్టి హామీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

భారత రాజ్యాంగం మరియు బాలల న్యాయవ్యవస్థ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని ప్రైవేటు న్యాయ బోధనా సంస్థ డైరెక్టర్ శిరీషరెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ విభాగంలో 'భారత రాజ్యాంగం - జువెనైల్ జస్టిస్'అనే అంశంపై ఎల్ ఎల్ బి హానర్స్ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి న్యాయ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోనే ఎన్నో అంశాలు పేర్కొనబడి ఉన్నాయని విద్యార్థులకు వివరించారు. శిరీష రెడ్డి మాట్లాడుతూ నిర్దిష్ట వయసు కంటే తక్కువ వయసు గల పిల్లలు నేరం చేయడానికి అసమర్ధులని డోలి ఇంకా పార్క్స అనే సూత్రం స్పష్టం చేస్తుందని వివరించారు. ఈ సందర్భంగా కార్యక్రమం చివరలో విభాగాధిపతి డాక్టర్ ఎస్.విజయలక్ష్మి ఇతర అధ్యాపకులు అతిథిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ అధ్యాపకులు డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ చెన్నం సతీష్, డాక్టర్ ఘంటా సతీష్, కుమార్ డాక్టర్ కె.శివరాం, పరుచూరి కుమారి, డాక్టర్ జ్యోతి సంపూర్ణ , అభిలాష్, గోపీనాథన్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ విజయలక్ష్మిని సన్మానిస్తున్న అధ్యాపకులు



మాట్లాడుతున్న ఎస్.ఎస్.చెంగయ్య

## సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ఎయిమ్స్ లో కాంట్రాక్టర్ చేస్తున్న వేతనం దోపిడీపై ఎయిమ్స్ వర్కర్స్ సంఘటితంగా ఉండి ఉద్యమించాలని ఎయిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్.ఎస్.చెంగయ్య అన్నారు. గురువారం సాయంత్రం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో ఎయిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం కమిటీ సమావేశం కె.బుజ్జి బాబు అధ్యక్షతన జరిగింది. చెంగయ్య మాట్లాడుతూ ఎయిమ్స్ లో పనిచేస్తున్న గార్డెన్ వర్కర్లను కాంట్రాక్టర్ వేతన దోపిడీ తీవ్రంగా చేస్తున్నారని విమర్శించారు. 16 వేల రూపాయలకు సంతకం చేయించుకొని 10000 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. పిఎఫ్ కట్ చేసి జమ చేయడం లేదని అన్నారు. యూనియన్ కార్యదర్శి ఎం.బాలాజీ మాట్లాడుతూ ఎయిమ్స్‌లో పనిచేస్తున్న వివిధ రకాల కార్మికులు దోపిడీ గురవుతున్నారని విమర్శించారు. దోపిడీ చేస్తున్న కాంట్రాక్టర్లపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కోశాధికారి గాలి శ్రీనివాసరావు, కె.రాజమోహన్, సాగర్, గార్డెన్ వర్కర్లు ప్రసన్నకుమారి, యేసు రత్నం, ఎస్తేర్ రాణి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది

## ముగిసిన డెంగీ మసోత్సవాలు

ప్రజాశక్తి - మంగళగిరి

జాతీయ డెంగీ మాసోత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం మంగళగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి తహశీల్దార్ కార్యాలయం నుండి తెనాలి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది, మూడు అర్బన్ హెల్త్ సెంటర్స్ సిబ్బంది, నిర్మల ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టి.ఎం.కె. సుబ్బరాయణం, ఏఎంఓ రాజు నాయక్, డాక్టర్ పి.అనూష, సతీష్, నిర్మల ఫార్మసీ కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారి రేఖ నరేష్‌బాబు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు కె.రామరాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల ఆదాయాలు పెంచుకోండి : కమిషనర్

ప్రజాశక్తి - దుగ్గిరాల

గ్రామ పంచాయతీల ఆదాయాలు పెంచుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఎం కఅష్ణ తేజ పంచాయితీ వారిని కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక పర్యటన చేశారు. స్వర్ణ పంచాయితీ పోర్టర్ నందు ఇంటి పన్ను డేటా ఎంట్రీ ఆదాయ వ్యయాలు పరిశీలిం చారు. పంచాయతీ పరిధిలో అసెస్ చేయాల్సిన ఇంటి పన్నును సత్వరమే కొలతలు నిర్వహించి ఆగస్టు 10వ తేదీ లోపు తన కార్యాలయానికి సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాణావతి ఖుషి బాయి, ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి కె.వివేకానంద, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ కమిషనర్

## వీధి దీపాలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామం దళిత కాలనీ రోడ్డులో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ షేక్ ఆలింబాషాకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వ్యవ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పంతగాని దాసు, సిపిఐ గ్రామ కార్యదర్శి జాలాది విజేందర్ రావు, గుర్రంకొండ సత్యానందం, పాలడుగు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న వల్లభనేని వెంకట్రావు

## సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, ఇతర టీడీపీ నాయకులు తాడేపల్లి 4వ వార్డ్‌కి చెందిన పులి రమేష్‌కి, 7వార్డ్‌లో మహమ్మద్ షాజిద్‌కి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇట్టా భాస్కర్, కె.విజయ్ కుమార్, దొంతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, బెజ్జం రామకృష్ణ, చెన్నయ్య, బాబురావు, రసూల్ పాల్గొన్నారు.



జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా పవర్ లిఫ్టర్లు

## జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా లిఫ్టర్లు

**ప్రజాశక్తి - మంగళగిరి**

ఆగస్టు 2వ తేదీ నుండి 7 వ తేదీ వరకు కేరళ రాష్ట్రం కోజికోడ్‌లో జరిగే నేషనల్ మాస్టర్స్ క్లాసిక్ & క్యాప్డ్ పవర్ లిఫ్టింగ్ (మెన్ & ఉమెన) పోటీలలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు గుంటూరు జిల్లాకు చెందిన కాంతా కుమారి, జ్యోతి వర్మ ఎంపికయ్యారని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కర్ రావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని గురువారం తెలియజేశారు. ఈ జాతీయ పోటీలలో కాంతా కుమారి మాస్టర్స్-1 క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ 76 కేజి విభాగంలో పాల్గంటారని, ఈమె గుంటూరు కె.వి.ఆర్ ఫిట్నెస్ సెంటర్, సెంట్రల్ స్కూల్ లో కోచ్ కొమ్మాకుల విజయ భాస్కర రావు వద్ద శిక్షణ పొందారని తెలిపారు. జ్యోతి వర్మ మాస్టర్స్ -2 క్లాసిక్ & ఎక్యాప్డ్ పవర్ లిఫ్టింగ్ 69 కేజీల కేటగిరిలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

## దినసరి వేతన ఉద్యోగి డిలేశ్వర రావుకు పీహెచ్‌డీ ప్రదానం

**ప్రజాశక్తి - ఏఎన్‌యు**

ఆచార్య నాగార్జున వర్సిటీలో దినసరి వేతన ఉద్యోగిగా పనిచేస్తున్న డిలేశ్వర రావుకు పీహెచ్‌డీ ప్రధానం చేశారు. సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగంలో ఆచార్య త్రిమూర్తిరావు పర్యవేక్షణలో సోషియో ఎకనామిక్ ప్రాబ్లమ్స్ ఆఫ్ ట్రైబల్ ఫామిల్స్ ఏ స్టడీ ఇన్ సీతంపేట మండల్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పింనందుకు గాను ఎస్.డిల్లేశ్వర రావుకి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ పి.సుధాకర్ తెలిపారు. ఈ గ్రంథ పరిశీలకులుగా యమ్ త్రి మూర్తి రావు ఉన్నారు. ఈ సందర్భంగా రిజిస్టర్ జి.సింహాచలం, రెక్టార్, రత్నశీలమణి సహా ఉద్యోగులు, నాన్ టీచింగ్ స్టాఫ్, అసిటెంట్ రిజిస్టర్ కావూరి శ్రీనివాసురావు, వికాస సెక్రటరీ జె.శ్రీను, తదితరులు డిల్లీస్వరరావును అభినందించారు



క్రీడలను ప్రారంభిస్తున్న ఎన్ఆర్ఐ సిబ్బంది

## క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

క్రీడలతో మానసిక శారీరక ఉల్లాసం ఉంది ఆరోగ్యంగా తయారు కావచ్చని ఎన్ఆర్ఐ అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ రావు పేర్కొన్నారు. ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ క్రీడా మైదానంలో గురువారం రణక్షేత్ర క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక మరియు సామాజిక ఆరోగ్యానికి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. క్రీడలు ఒత్తిడిని తగ్గించి ఏకాగ్రతను పెంచుతాయని చెప్పారు. జట్టుకఅషి మరియు నాయకత్వ నైపుణ్యాలను పెంపొందిస్తాయని అన్నారు. టేబుల్ టెన్నిస్, వాలీబాల్, చెస్, రన్నింగ్, బాస్కెట్ బాల్, లాంగ్ జంప్, కబడ్డీ పోటీలు, క్యారమ్స్ మొదలగు పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు






పర్యాటకుల సండి



దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

# కృష్ణమ్మ పరవళ్లు





పర్యాటకుల సండి

- సాగర్ జలాశయానికి 2,82,609 క్యూసెక్కుల ఇన్ ఫ్లో
- 585.10 అడుగుల వద్ద జలాశయం నీటి మట్టం
- పర్యాటకుల సందడి

**ప్రజాశక్తి - విజయపురిసౌత్**

కృష్ణానది పరివాహక ప్రాంతాలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువనున్న జలాశయాలు నిండి ఉధఅతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాజెక్టులన్ని నిండి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు.గురువారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయం 8 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి మరియు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ మొత్తం 2,82,609 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్ రిజర్వాయర్ కు వచ్చి చేరుతుండటంతో ఎన్ఎస్పి అధికారులు 26 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,96,742 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువనుండి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతుండటంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. దీనితో నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 585.10 అడుగులవద్ద నీరు నిల్వవుంది.డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 297.7235 టీఎంసీల నీరు నిల్వ ఉంది.జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,273 క్యూసెక్కుల నీటిని,కుడి కాలువ ద్వారా 8604 క్యూసెక్కుల నీటిని,ఎడమ కాల్వద్వారా 7110 క్యూసెక్కుల నీటిని,ఎస్.ఎల్.బి.సి ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని,లోలేవల్ కెనాల్ ద్వారా 300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నుండి మొత్తం 2,43,829 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

**పర్యాటకుల సందడి**

నాగార్జునసాగర్ డ్యామ్ 26గేట్ల నుండి దిగువకు విడుదలవుతున్న సుందరమైన నీటి దఅశ్యాల అందాలను ప్రత్యక్షంగా చూసేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆంధ్ర తెలంగాణ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ప్రైవేటు ప్రభుత్వ వాహనాల్లో ప్రజలు డ్యాం అందాల తిలకిచ్చేందుకు భారీ ఎత్తున వస్తున్నారులాంచీ స్టేషన్ వద్ద, కొత్త బ్రిడ్జి,పాత వంతెన,డ్యామ్ ఎంట్రన్స్ భాగంలో పర్యాటకుల సందడి వాతావరణం నెలకొంది.సాగర్ అందాలను తనివితీరా చూస్తూ తమ ఆనందాన్ని తోటి వారితో పంచుకుంటున్నారు.డ్యామ్ దిగువ భాగాన పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు.

## ఆన్‌లైలో భూమి తొలగించారని సెల్ టవర్ ఎక్కిన రైతు

**ప్రజాశక్తి-ఈపూరు**

స్థానిక రెవెన్యూ అధికారులు తన భూమిని ఆన్లైన్లో తొలగించారని అంతేకాక తన పొలం ఆనుకొని ఉన్న వ్యక్తులు వారి పొలాన్ని ఆక్రమించానంటూ ఆరోపిస్తున్నారని మండల కేంద్రం ఈపూరు గ్రామానికి చెందిన రైతు కొంగా వెంకటేశ్వర్లు పురుగుమందు డబ్బా తీసుకొని గ్రామంలోని సెల్ టవర్ ఎక్కి గురువారం ఆందోళన చేశాడు. సమాచారం అందుకున్న ఎస్సై యు ఉమామహేశ్వరరావు సెల్ టవర్ వద్దకు చేరుకొని బాధిత రైతు కొంగా వెంకటేశ్వర్లు తో మాట్లాడి సమస్యను తెలుసుకొని తహసిల్దార్ కు ఫోన్లో వివరించారు. సమస్యను పరిష్కరిస్తామని ఎస్సై హామీ ఇవ్వడంతో కొంగా వెంకటేశ్వర్లు కిందికి దిగాడు. అనంతరం రెవిన్యూ అధికారులు ఇద్దరు రైతుల వద్ద ఉన్న భూమి తాలూకు పత్రాలను తీసుకొని కార్యాలయం వద్దకు రావాలని సూచించారు.



నిరసన తెలుపుతున్న రైతు

## మిషన్ గ్రీన్ గుంటూరు లోగో డిజైన్లకు ఆహ్వానం

**ప్రజాశక్తి - గుంటూరు**

గుంటూరు నగరపాలక సంస్థ స్వచ్ఛ గుంటూరుక్లీన్ గుంటూరు కాన్సెప్ట్‌లో మిషన్‌గ్రీన్ గుంటూరు నినాదంతో లోగో డిజైన్ల కోసం నగర ప్రజలు, స్టేక్ హెూల్డర్స్, విద్యార్థులు, వివిధ సంస్థల నుండి డిజైన్ల ఆహ్వానానికి విశేష స్పందన లభిస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. లోగోలను ఏఐ టెక్నాలజీతో కాకుండా వ్యక్తిగత నైపుణ్యానికి పదును పెట్టి, గుంటూరు నగరాన్ని ప్రతిబింబించేలా డిజైన్లు రూపొందించి ఆగస్ట్ 5వ తేదీలోపు జిఎంసి వాట్సాప్ నంబర్ 9849908391కు గానీ, జిఎంసి మెయిల్ ఐడి mc.guntur@cdma.gov.inకి పంపించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ హిత గుంటూరే లక్ష్యంగా పచ్చదనం పెంపుకోసం ఈ సీజన్‌లో 5 లక్షల మొక్కలు నాటడం, పారిశుధ్య పనులలో మెరుగుదల, వ్యర్థాలను తడిపొడిగా వేరుచేసి తీసుకోవడం, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేదం, నగరంలోకి వచ్చే ప్రధాన మార్గాలు, జంక్షన్లు, ఐలాండ్స్, పార్కులు, డివైడర్లపై పచ్చదనం పెంపు వంటి చర్యలు పకడ్బందీగా తీసుకుంటున్నామని, అందులో భాగంగా చేపట్టిన మిషన్ గ్రీన్ గుంటూరుని ప్రజల్లోకి విస్తఅతంగా తీసుకెళ్లేలా ఆకర్షణీయమైన డిజైన్‌తో కూడిన లోగో కోసం ప్రజలు, విద్యార్థులు, స్టేక్ హెూల్డర్స్ నుండి డిజైన్‌లు ఆహ్వానిస్తున్నా మన్నారు. ఆసక్తి ఉన్న వారు తాము రూపొందించిన లోగో డిజైన్‌ను సెల్ఫ్ డిక్లరేషన్, పేరు, ఫోన్ నెంబర్ వంటి వివరాలతో ఆగస్టు 5వ తేదీలోపు పంపవచ్చని తెలిపారు. డిజైన్లను జిఎంసి ఏర్పాటు చేసిన కమిటి ద్వారా పరిశీలించి, ఉత్తమ డిజైన్ ను ఎంపిక చేసి, వారికి నగదు బహుమతితో పాటు జిఎంసి ప్రశంసా పత్రాన్ని అందిస్తామన్నారు.

## ఎన్‌టిఆర్ స్టేడియం ఎన్నికలకు 12 నామినేషన్లు

**ప్రజాశక్తి - గుంటూరు**

ఎన్‌టిఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్‌పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు రెండోరోజు గురువారం 12 నామినేషన్లు వచ్చినట్లు జిఎంసి డిప్యూటీ కమిషనర్, ఎన్నికల నిర్వహణ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. వాటిలో వైస్‌ప్రెసిడెంట్‌కి 2, సెక్రటరీకి 2, జాయింట్ సెక్రటరీకి 2, ట్రెజరర్ 1 నామినేషన్, ఎక్జిక్యూటివ్‌బాడీ మెంబర్స్ పురుషుల నుండి 4, ఎగ్జిక్యూటివ్‌బాడీ మెంబర్స్ మహిళల నుండి 1 నామినేషన్ వచ్చాయన్నారు. ఈసందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ మొదటి రోజు ఐదు నామినేషన్లు కలిపి మొత్తం 17 నామినేషన్లు వచ్చాయన్నారు. నేటితో నామినేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుందన్నారు. కావున ఆసక్తి ఉన్న వారు నామినేషన్లు దాఖలు చేయాలన్నారు.

## పుట్టపర్తి సాయిబాబా శత జయంతి వేడుకల్ని ప్రభుత్వం జరపొద్దు

**ప్రజాశక్తి - మంగళగిరి**

పుట్టపర్తి సాయిబాబా శతజయంతిని రాష్ట్ర ప్రభుత్వం పండుగగా జరపడాన్ని విరమించుకోవాలని భారత హేతువాద సంఘ అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య అన్నారు. గురువారం మంగళగిరి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శతజయంతి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం 862 జీవో ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ సందర్భంగా జీవో కాపీలను చించివేశారు. మతము, దేవుడు వ్యక్తిగతంగానే ఉండాలని అన్నారు. ప్రభుత్వపరంగా అలాంటి కార్యక్రమాలు జరపడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకురావడం రాష్ట్ర ప్రజలను అవమానపరచడమే అని అన్నారు. చిన్న చిన్న మ్యాజిక్కులు నేర్చుకొని వాటిని బాబా మహత్యాలుగా ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసుకొని వేలకోట్లు సంపాదించారని అన్నారు. ఇలాంటి వారిని ప్రభుత్వం జైల్లో పెట్టాలని, అలా చేయకుండా శతజయంతిని ప్రభుత్వ పరంగా జరపాలని చెప్పడం దారుణమని అన్నారు. ఇలా చేయడం రాష్ట్ర ప్రజలకు ఏమి సందేశం, ఏమి సంకేతం ఇవ్వాలని నిశ్చయించుకుంటుందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే జీవోను రద్దు చేయాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్ మాట్లాడుతూ కల్తీ మందులు, కల్తీ సరుకులు అమ్మే రాందేవ్ బాబాకు ప్రభుత్వ భూములు కట్టబెట్టడం మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్ట్ పలుమార్లు చివాట్లు పెట్టిందని అన్నారు.



జీవో కాపీని చింపేస్తున్న హేతువాద సంఘం అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య